

## హంసవాహనంపై కపిలేశ్వరుడు

తిరుపతి(రవాణ), ఫిబ్రవరి 19ప్రభాతవార్త: తిరుపతిలోని ప్రముఖ శైవాలయం కపిలేశ్వరుని ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో వైభవంగా మొదలయ్యాయి. రాత్రి హంసవాహనంపై స్వామి అమ్మ వార్లు ఊరేగారు. భక్తులను కరుణించారు. ఉదయం అర్చకుల వేదమంత్రోచ్చరణలు, శంఖనాదాలు, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు మణివాసన్ గురుకుల్ వేదోక్తంగా ధ్వజపటం ఎగురువేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, అర్చకులు ఉదయగురుకుల్ భక్తులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త





# కార్యకర్తే అధినేత !

## కూటమితో కలిసి పనిచేయండి

### ఉత్తమసేవలందించిన కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు



తిరుపతి, ఫిబ్రవరి 19ప్రభాతవార్త: కోటి సభ్యత్వాలతో అతిపెద్ద కుటుంబంగా నిలిచిన తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే అధినేత అని రాష్ట్రవిద్య, ఐటిశాఖల మంత్రి నారాలోకేశ్ స్పష్టం చేశారు. ఆ మాటకు కట్టుబడి కార్యకర్తలతోనే తిరుపతిలో బుధవారం ఉదయం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఒకరోజు తిరుపతి పర్యటనకు వచ్చిన ఆయన ఉదయం కపిలతీర్థంసమీపంలోని పార్టీ కార్యాలయంలో తిరుపతి నియోజకవర్గ నేతలు, కార్యకర్తలతో ఆప్యాయంగా సమావేశమయ్యారు. ఇకపై ఏ నియోజకవర్గం పర్యటనకు వెళ్ళినా ముందుగా కార్యకర్తలతోనే సమావేశమై వారి సాధకబాధకాలు తెలుసుకుని ,వారికి అండగా నిలబడతానన్నారు. మన టిడిపి యాప్‌లో ఉత్తమ ప్రతిభకనబరచిన కార్యకర్తలు, నాయకులతో ఎక్కువ సమయం కేటాయించారు. కార్యకర్తల సమస్యలు అడిగి తెలుసుకుని ,పరిష్కరించి వారి అండగా ఉంటానని భరోసానిచ్చారు. పార్టీలో పనిచేసేవారికి ప్రోత్సాహం ఉంటుందన్నారు. పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి లోకేశ్ నిర్ధేశం చేశారు. పార్టీ ఏ పిలుపునిచ్చినా జయప్రదం చేయాలని, కూటమి పార్టీల నేతలను కలుపుకుని పనిచేయాలని సూచించారు. ఏ విషయం అయినా సమిష్టిగా చర్చించుకుని సమస్యలు పరిష్కరించుకోవాలని అన్నారు. పార్టీలో గ్రూపు రాజకీయాలకు దూరంగా ఉండాలని, మన లక్ష్యం పార్టీ బలోపేతం కావడమేనని మంత్రి అన్నారు. నేడు వైసిపికి ప్రతిపక్షహోదా కూడా లేదని, వైసిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టాలని ఆయన నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జగన్‌రెడ్డి అన్నీ అప్పులుచేసి పోయారని, అయినా ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లిస్తున్నామని ,ఫెన్షన్ అందిస్తున్నామని మంత్రి తెలిపారు. తిరుపతిలో టిడిపి కార్యకర్తలకు ఏ పనులు కావడం లేదని, సమన్వయకర్త(ఓఎస్‌డి)నినియమించాలని కోరారు. దీనిపైస్పందించినలోకేశ్ తిరుపతిలో కూటమి ఎమ్మెల్యే అధికారంలో ఉన్నా, మీకు అన్నీ పనులు జరుగుతాయన్నారు. కూటమితో కలిసి పనిచేయాలని మంత్రి హితవు చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జిమంత్రి అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు పులివర్తినాని, బొజ్జలసుధీర్‌రెడ్డి, తిరుపతినాయకులు రవినాయుడు, సూరాసుధాకర్‌రెడ్డి, పుష్పావతియాదవ్, నరసింహయాదవ్, శ్రీధర్‌వర్మ, వట్టికుంటశంకరనారాయణ, సుగుణమ్మ, మబ్బుదేవనారాయణరెడ్డి, పులిగోరు మురళి, జెబి శ్రీనివాస్, శ్రీనివాసులు, ఆర్‌సి మునికృష్ణ, వట్టికుంట శంకరనారాయణ, దంపూరి భాస్కర్, , మునిశేఖర్‌రాయల్, బుల్లెట్‌రమణ, ఆనంద్‌గౌడ్, హేమంత్‌రాయల్, కరాటే చంద్ర తదితరులతో కలిసి ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూజలు చేశారు. అనంతరం ఉత్తమసేవలందించిన కార్యకర్తలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

## పద్మావతి యూనివర్సిటీలో 7.5 కోట్లతో

# అధునాతన ఇండోర్ హాల్ ప్రారంభం



తిరుపతి విద్య ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో కేంద్ర ప్రభుత్వం, మహిళా యూనివర్సిటీ, శాప్ సంయుక్తంగా రూ.7.5 కోట్లతో నిర్మించిన ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్ హాల్‌నీ మంత్రి లోకేష్ బుధవారం ప్రారంభించారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ పద్మావతి యూనివర్సిటీ వేదికగా ఉత్తమ క్రీడాకారిణులను తయారుచేసేందుకు కొత్తగా నిర్మించిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం దోహదపడుతుందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణులతో మంత్రి లోకేష్ కొద్దిసేపు షటిల్ ఆడి ఉత్సాహ పర్చారు. అధునాతన సౌకర్యాలతో ఏర్పాటుచేసిన ఏరోబిక్స్, టైక్వాండో, యోగా మెడిటేషన్ సెంటర్లను కూడా లోకేష్ ప్రారంభించారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమ మాట్లాడుతూ క్రీడాకారిణులకు యూనివర్సిటీలో మంచి శిక్షణ వేదిక లభించడం గొప్ప అవకాశమన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. క్రీడాభివృద్ధికి మంత్రి లోకేష్ చూపుతున్న చొరవ, కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శాప్ ఎండి గిరీషా, శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, బొజ్జల సుధీర్ రెడ్డి, శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్, తిరుపతి మున్సిపల్ కమిషనర్ మౌర్య, యూనివర్సిటీ రిజిస్ట్రార్ రజని తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలపై గళమెత్తిన విద్యార్థినులు

## మహిళా వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి విద్యార్థినులతో మంత్రి లోకేష్ ముఖాముఖి



తిరుపతి విద్య ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

పద్మావతి మహిళా వర్సిటీకి విచ్చేసిన విద్యాశాఖ మంత్రి లోకేష్ ఇంజనీరింగ్ విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను అడిగితెలుసుకునే క్రమంలో విద్యార్థులు మంత్రికి తమ సమస్యలను ఏకరువు పెట్టారు".

**- ఫీజురీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించండి**

పద్మావతి యూనివర్సిటీ అధునాతన ఇండోర్‌హాల్ ను ప్రారంభించిన అనంతరం మహిళా వర్సిటీ ఈఈఈ విభాగానికి చెందిన 3వ సంవత్సరం విద్యార్థినుల తరగతిగదులను ఆయన సందర్శించి వారితో ముఖాముఖి బేటీ నిర్వహించారు. విద్యార్థిని మేఘన మాట్లాడుతూ గత ప్రభుత్వంలోని ఫీజురీయింబర్స్ మెంట్ బకాయిలాను విడుదల చేయాలని కోరగా మంత్రి లోకేష్ స్పందిస్తూ... ఇకపై ఫీజురీయింబర్స్ మెంట్ సొమ్మును సెమిస్టర్ వారీగా విడుదల చేస్తామన్నారు. గత ప్రభుత్వం సుమారు రూ.4వేల కోట్ల రూపాయల ఫీజురీయింబర్స్మెంట్ బకాయిలు పెట్టి వెళ్లిందని, రాష్ట్రం ఆర్థికంగా కుదుటపడ్డాక విడతల వారీగా గత బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

**ఉపాధికి అనువైన కోర్సులలో శిక్షణ ఇవ్వండి**

మరో ఇంజనీరింగ్ విద్యార్థిని విజయలక్ష్మి మాట్లాడుతూ... ఇంజనీరింగ్ పూర్తయ్యాక వివిధ అనుబంధ కోర్సులు నేర్చకోవడానికి పెద్దఎత్తున ఖర్చుచేయాల్సి వస్తోందని, యూనివర్సిటీలోనే ఉద్యోగాలకు అవసరమైన కోర్సుల్లో శిక్షణ ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉన్నత విద్యావిభాగాన్ని బలోపేతం చేస్తున్నాం, ఇటీవలే విద్యాధికుడైన ఛైర్మన్‌ను నియమించామని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీ విద్యార్థులు రాణించేలా యూనివర్సిటీ విద్యావిధానంలో మార్పులు తెస్తామని తెలిపారు. మోనిక అనే విద్యార్థిని మాట్లాడుతూ..విద్యతోపాటు స్పోర్ట్స్‌కుకూడా ప్రోత్సాహం కల్పించాలని కోరారు.

**హాస్టల్లో ఆహారం తినలేకున్నాం...**

వర్సిటీకి చెందిన రాజకుమారి అనే విద్యార్థిని మాట్లాడుతూ... వర్సిటీలో అందించే ఆహారం కొంచం ఇబ్బందికరంగా ఉంది తినలేకున్నాం... మార్పులు చేయాలని కోరారు. మంత్రి స్పందిస్తూ అధికారులతో మాట్లాడి 2వారాల్లో సమస్యను పరిష్కరించి నాణ్యమైన ఆహారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కడపకు చెందిన సరీమ్ మాట్లాడుతూ వర్సిటీ హెల్త్ సెంటర్ లో జనరల్ డాక్టర్ తోపాటు సైకాలజిస్ట్ ను కూడా ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు.

**-ఉద్యోగవకాశాల కోసం కోచింగ్ ఇప్పించండి**

శిరీష అనే విద్యార్థిని మాట్లాడుతూ... ఇంజనీరింగ్ ఈఈఈ విభాగంలో 70 మంది వరకు విద్యనభ్యసిస్తున్నాం. తాము 4వ సంవత్సరం కోర్సు పూర్తిచేసే లోగానే వివిధ ఉద్యోగాలకు సంబంధించిన కోచింగ్ ఇప్పించండి. ప్లేస్ మెంట్ కౌన్సిలింగ్కు ముందే తమకు శిక్షణ ఇస్తే ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఈఈఈ విద్యార్థినులకు ప్లేస్మెంట్స్ విషయంలో ఎటువంటి డోకా లేదు. రేణిగుంట, కడపల్లో ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటుచేశాం. కొత్తపరిశ్రమలు రావడానికి అవసరమైన ఎకో సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నాం. డిజైనింగ్‌కు సంబంధించిన యూనిట్లు కూడా వస్తున్నాయని చెప్పారు.

### సరస్వతీ అలంకరణలో

# హంస వాహనంపై శ్రీనివాసుడు



చంద్రగిరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారు వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండవ రోజు బుధవారం రాత్రి 7 గంటలకు స్వామివారు విశేష అలంకరణలతో వీణా ధారియైన సరస్వతీదేవీ అలంకరణలో హంస వాహనంపై విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహనసేవ ఔన్నత్యంపై ఆలయ ప్రధాన అర్చకులు బాలాజీ రంగాచార్యులు మాట్లాడుతూ "సర్వంహితి సరస్వతీదేవి అవతారంలో దాగివుందన్నారు. ఇహలోకంలో వున్నటువంటి అముష్మికమైన కోర్కెల నుంచి తప్పించి పరలోకాన వున్న పరమాత్మునిపై దృష్టి సారించడానికి వీలుగా పాలను, నీళ్ళను వేరుచేసి సేవించగల హంసను వాహనంగా చేసుకుని దేవదేవుడు భక్తులకు దర్శనమిస్తారని అన్నారు. బ్రహ్మోత్సవాలలో స్వామి వారిని దర్శించుకోవడం ద్వారా ఈతి భాధలు తీరి సుఖశాంతులు లభిస్తాయని అన్నారు. కాగా స్వామివారి బ్రహోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడికి ఉదయం స్నపన తిరుమంజన సేవ, సాయంత్రం ఊంజల్ సేవ నిర్వహించారు. ఈ వాహన సేవలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి ఆధ్వర్యంలో ఏఈఓ ఎం.గోపినాథ్, సూపరింటెండెంట్లు వలిశెట్టి రమేష్‌బాబు, రాజ్‌కుమార్, టెంపుల్ ఇన్ స్పెక్టర్ ద్వారక మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



# ఈఎస్ఐ వైద్య సేవలు మరింత విస్తృతం

## మంత్రి వాసం శెట్టి సుభాష్

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : రాష్ట్రంలో కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర కార్మిక, ఫ్యాక్టరీలు, బీమా వైద్య సేవల శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ ప్రకటించారు. ఆయన బుధవారం మధ్యాహ్నం తిరుపతి కార్మిక రాజ్య బీమా (ఈఎస్ఐ) ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాను వచ్చిన రోజు కంటే నేడు రోగుల సంఖ్య పెరగడంతో పాటు వారికి మెరుగైన సేవలను అందిస్తున్న మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబును మంత్రి అభినందించారు. ప్రతి కార్మికుడికి మెరుగైన సేవలను అందించాలని మంత్రి డాక్టర్ల బృందానికి, సిబ్బందికి మంత్రి పిలుపునిచ్చారు. గత ఆరు సంవత్సరాల పైగా రాయలసీమ నెల్లూరు లాంటి జిల్లాల ఈఎస్ఐ కార్మికులకు అందని ద్రాక్షగా ఉన్న తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి సెకండరీ, టెరిటరీ రేఫరల్ వైద్యసేవలు, మరికొన్ని రోజుల్లో అందుబాటులోకి రానున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఇందుకు ప్రత్యేక కృషి చేసిన రాష్ట్ర బీమా వైద్యశాఖ డైరెక్టర్ వి. ఆంజనేయులు, ఈఎస్ఐ కార్పొరేషన్ సంస్థ విజయవాడ రీజనల్ డైరెక్టర్, తిరుపతి ప్రాంతీయ అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు. మంత్రి వెంట మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.శ్యాంబాబు, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

# పక్కాగా ఇంటర్, టెన్త్ పరీక్షలు

## - కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం



చిత్తూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: మార్చి 1 నుండి ప్రారంభం కానున్న ఇంటర్మీడియేట్ పబ్లిక్ ధియరీ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు, మార్చి 17 నుండి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలు పక్కాగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్ ఇంటర్మీడియేట్, టెన్త్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇంటర్మీడియేట్ మొదటి, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 1 నుండి 20వ తేదీ వరకు జరుగుతుందన్నారు. మొత్తం 30,652 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, ఇందులో మొదటి సంవత్సరం ఇంటర్మీడియేట్‌కు సంబంధించి 15,482 మంది, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియేట్ పరీక్షలకు 15,170 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 50 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింద న్నారు. అలాగే టెన్త్ పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుండి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయని, జిల్లా వ్యాప్తంగా 118 పరీక్షాకేంద్రాలు ఏర్పాటుచేయడం జరిగిందని, ఇందులో 20,954 రెగ్యులర్, 294 ప్రైవేటు విద్యార్థులు మొత్తం కలిపి 21,248 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారన్నారు.

## మార్చి 2లోపు దారిద్ర్యరేఖ దిగువ వున్నవారు గుర్తింపు: కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగువవున్న వారిని మార్చి 2వ తేదీలోపు గుర్తించి పి4 విధానం ద్వారా వారి ఆర్థిక సాధికారతకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ పి4(పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్‌షిప్) విధానం ద్వారా పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడానికి జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో గత 20 శాతం నిరుపేదలను గుర్తించడానికి నిర్వహించనున్న సర్వేపై మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలుకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశా నిర్ధేశం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా పరిపుష్టిగా వున్న వారి సహకారంతో అట్టడుగు స్థాయిలో వుంటూ జీవించడానికి కనీస సౌకర్యాలు లేని వారి జీవన ప్రమాణాలను మెరుగు పరచడానికి పి4 విధానంను అవంభిస్తున్నదన్నారు. ఫిబ్రవరి 20 నుండి మార్చి 2వ తేదీ వరకు సర్వే చేపట్టి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేయాలని మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలను కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జిల్లా ప్రణాళిక అధికారి సాంబశివారెడ్డి, డిఎల్‌డిఓ రవికుమార్, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రోటోకాల్ పాటించలేదని ఫిర్యాదుతో

# శిలాఫలకం తొలగింపు



**ప్రోటోకాల్ పాటించకుండా శంకుస్థాపన కోసం ఏర్పాటు చేసిన శిలాఫలకం**
**శిలాఫలకం కనబడకుండా న్యూస్ పేపర్లు అతికించిన అటవీశాఖ శాఖ సిబ్బంది**

వెంకటగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

పట్టణంలోని నగరవనం పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాటుచేసిన శిలాఫలంలో ప్రోటోకాల్ పాటించలేదని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదరుమల్లి రాంకుమార్ రెడ్డి ఫిర్యాదుతో అటవీశాఖ అధికారులు శిలాఫలకాన్ని తొలగించారు. ఈనెల 12వ తేదీ కోటి 50 లక్షల రూపాయలు నగరవనం పనులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ప్రారంభించారు. అయితే పనుల ప్రారంభోత్సవానికి ఏర్పాటు చేసిన శిలాఫలకం లో డిప్యూటీ సీఎం అటవీ శాఖ మంత్రి అయిన పవన్ కళ్యాణ్, తిరుపతి పాలమెంటు సభ్యులు మద్దెల గురుమూర్తి పేర్లు లేవని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి గుర్తించి ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తున్నట్లు విలేకరుల సమావేశంలో ప్రకటించారు. అటవీ శాఖ అధికారులు గుర్తించి వెంటనే తప్పులు తెలుసుకున్నారు. శిలాఫలకం కనబడకుండా పేపర్లను అతికించారు. ఈ శిలా ఫలకాన్ని తొలగించి ప్రోటోకాల్తో ఉన్న కొత్త శిలాఫలకాన్ని ఏర్పాటు చేస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న శిలాఫలకంలో ఎమ్మెల్యే రామకృష్ణ, అటు శాఖ అధికారుల పేర్లు మాత్రమే ఉన్నాయి. అటవీ శాఖ మంత్రి, ఎంపీ పేర్లు లేకపోవడం పట్ల అందరూ అవాక్కయ్యారు. ఈ విషయాన్ని గుర్తించిన రాంకుమార్ రెడ్డి ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పడంతో అటవీ శాఖ అధికారులు అప్రమత్తమయి కొత్త శిలాఫలకం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు.

# మైనర్ బాలిక కేసు వేగవంతం

## గ్రామంలో విచారణ చేపట్టిన డిఎస్పీ

## పసిబిడ్డను తీసుకోవడానికి నిరాకరించిన బాలిక తల్లిదండ్రులు

పలమనేరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త: మైనర్ బాలిక మృతి కేసులో విచారణను డిఎస్పీ ప్రభాకర్ వేగవంతం చేశారు. బుధవారం గ్రామంలో విచారణ చేపట్టిన డిఎస్పీ ప్రభాకర్ పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు, తల్లిదండ్రులను విచారించారు. ఈ నెల 15న టి.వడ్డూరుకు చెందిన ఓ మైనర్ బాలిక ఓ బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందిన విషయం విధితమే..ఈ మేరకు పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేసి అనుమానితులను గాలిస్తున్నారు. ఓ మైనర్ బాలిక గర్భవతి కావడం బిడ్డకు జన్మనిచ్చి మృతి చెందిన విషయం జిల్లాలో సంచలనం రేపింది. ఈ క్రమంలో డిఎస్పీ ఆధ్వర్యంలో సిఐ నరసింహరాజు, ఎస్ఐ స్వర్ణతేజ సిబ్బందితో విచారణను వేగవంతం చేస్తూ గ్రామంలో విచారణ చేపట్టారు. అనంతరం బాలిక చదువుతున్న పెంగరగుంట ప్రాథమిక ఉన్నత పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను బాలిక హాజరు వివరాలు, పాఠశాలలో బాలిక పరిస్థితులను ఆరా తీశారు. ప్రథమిక విచారణలో కేసు పురోగతి సాధింస్తుందని త్వరలో నిందితులను అరెస్టు చేస్తామని డిఎస్పీ ప్రభాకర్ తెలిపారు.

**పసిబిడ్డను తీసుకోవడానికి నిరాకరించిన బాలిక తల్లిదండ్రులు:** తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న పసిబిడ్డ ఆరోగ్యం మెరుగుపడడంతో పలమనేరు ఐసిడిఎస్ సిడిపిఓ ఇందిరాప్రియదర్శిని, పరివేక్షణాధికారి మధవీలత, సిబ్బందితో పసిబిడ్డను తీసుకోవాలని మృతి చెందిన బాలిక తల్లిదండ్రులు కోరారు. అయితే వారు పసిబిడ్డను తీసుకోవడానికి నిరాకరించారు. తమకు ఆర్థికంగా ఇబ్బందిగా ఉందని ఈ క్రమంలో పసిబిడ్డను పోషించలేదని వారు అధికారులకు తెలిపారు. అయితే ఐసిడిఎస్ అధికారులు పసిబిడ్డ పరిస్థితి మెరుగుపడిందని పసిబిడ్డ కుటుంబ సభ్యుల సంరక్షణలో ఉండాలని తెలపడంతో వారు మాకు 3 రోజులు సమయం కావాలని తెలిపారు. దీనిపై ఐసిడిఎస్ సిడిపిఓ మాట్లాడుతూ బాలిక తల్లిదండ్రులు పసిబిడ్డను తీసుకోవడానికి నిరాకరిస్తున్నారని వారు పసిబిడ్డను తీసుకోని పక్షాన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# శివరాత్రికి పానగల్ ముస్తాబు: కొత్త రోడ్లు

## రూపు దిద్దుకుంటున్న ధూర్జటి కళాప్రాంగణం



**రాతిస్థంభాలపై నంది విగ్రహం, ధూర్జటి కళాప్రాంగణం**

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

దక్షిణ కైలాసంలో పంచభూత లింగాల్లో వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసి భక్తుల కొంగు బంగారంగా వరాలిస్తున్నాడు. 'భోళాశంకరునికి మహాశివరాత్రి సందర్భంగా ఊరంతా సంబరాలు' జరుపుకొనుటకు సన్నాహాలు జరుగుతున్నాయి. పట్టణంలోనూ చుట్టుపక్కల గ్రామాల్లో ముస్తాబులే ముస్తాబులన్నట్లు మారింది. పట్టణంలోని మూల మూలల్లోనూ, అనుబంధ ఆలయాల్లో విద్యుత్ దీపాల సంబరాలు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే నాలుగుమాడావీధుల్లో శివయ్య సంబరాలకు సిద్దమయ్యాయి. శ్రీకాళహస్తి ఆలయంలో విద్యుత్ దీపాలు ఆకట్టుకుంటున్నాయి. ముఖ్యంగా ఆలయంలో అడుగుపెట్టిన వెంటనే సంప్రదాయాలకు పెద్దపీట వేసినట్లు రూపుదిద్దుతున్నారు. ఆలయం అంతా రంగు రంగుల ముగ్గులు వేసారు. ఇక విద్యుత్ దీపాలంకరణలో చూడటానికి వేయి కళ్ళు చాలవన్నట్లు మారింది. ఇక బిక్షాల గాలిగోపురానికి అమర్చిన 'ఓం నమ:శివాయ'అనే నూయాన్ లైటింగ్ ఇటు తేరువీధి, అటు బజారువీధులను పాల వెలుగుల్లా మార్చేసింది. కృష్ణారెడ్డి మండపం వద్ద బస్సులు దిగే భక్తులకు ఆలయం ఎక్కడో మార్గదర్శక సూచకంగా ఉంది. ఇక ప్రతి విద్యుత్ వెలుగు పై కాషాయం అకర్షణీయంగా మారింది. ఊరంతా పండగ అన్నట్లుమారింది. ఆలయం నుంచి ఇటు కుమారస్వామి కొండ వరకు స్వర్ణముఖిపై ఉన్న వంతెనలపై నాలుగుమాడావీదుల్లో విద్యుత్ తోరణాలు పట్టణానికి ప్రత్యేకంగా ఉన్నాయి.

**సాంస్కృతిక వేదికకుప్రాధాన్యత:**

13రోజుల పాటు జరిగే ఉత్సవాలలో సంప్రదాయ కళాకారులకు వేదికపై అవకాశం కల్పించుటకు పాలకులు నిర్ణయించుకొని ప్రణాళిక రూపొందించారు. సుమారు 150 మంది యువ కళాకారులకు అవకాశం కల్పించారు. కనుమరుగౌతున్న కళలకు కళాకారులకు నటరాజు వేదికపై అవకాశం కల్పించారు. ఈ నెల 21 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రత్యేకంగా ధూర్జటి కళాప్రాంగణాన్ని రాజగోపురం దిగువ భాగాన ఏర్పాటుచేసారు. నాలుగుమాడావీధుల్లో మైక్ సెట్‌లు ఏర్పాటు చేసారు.

## చిత్తూరు ఆసుపత్రికి వైద్య కోసం వచ్చే వారికి పక్కాగా సేవలు

### - వైద్యాధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:

చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి, ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్, ఇతర అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వివిధ సేవల నిమిత్తం వచ్చే పేషెంట్లకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా సకాలంలో వైద్య సేవలు అందేలా ఆరోగ్యమిత్రలు స్పందించి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. పేషెంట్ల వార్డులను పరిశీలించి వారి పొందే సేవల్లో ఎలాంటి సమస్యలు వున్నా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి వైద్య సేవలు అందించేలా పని చేయాలన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వైద్య సేవల కోసం వచ్చే పేషెంట్ల నుండి ఎలాంటి డబ్బు తీసుకున్నట్లు ఫిర్యాదులు అందితే సంబంధితులపై చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశంలో డిసిహెచ్‌ఎస్ డాక్టర్ ప్రభావతి, ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్, అపోలో ఆసుపత్రి ఇన్‌ఛార్జీ నరేష్‌కుమార్‌రెడ్డి, ఇతర సంబంధిత అదికారులు, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న ఆరోగ్యమిత్రలు పాల్గొన్నారు.

## నేడు ఎబిసి సెంటర్ ప్రారంభం

### - మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్



చిత్తూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీధి శునకాలకు కుటుంబ నియంత్రణ, శస్త్రచికిత్సలు, వాక్సినేషన్ వంటి కార్యక్రమాలు నిర్వహించడానికి గురువారం ఉదయం 9.30 గంటలకు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ వెహికల్ షెడ్ ఆవరణలో అనిమల్ బర్త్ కంట్రోల్(ఎబిసి) సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు, మేయర్ అముదలు హాజరు కానున్నారన్నారు. ఈ కేంద్రంలో ఇప్పటికే శునకాలకు శస్త్రచికిత్సలు, వాక్సినేషన్ చేయడానికి ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేశామన్నారు. ఎబిసి కేంద్రంలో నిర్వహిస్తున్న ఏర్పాట్లను మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌లు బుధవారం పరిశీలించారు.

## అరాచకవాదులంటే వైఎస్ జగన్‌కు ప్రేమ

### - రాష్ట్ర తెలుగుదేశం అదికార ప్రతినిధి వెంకిటి సురేంద్రకుమార్

చిత్తూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార:



మాజీ ముఖ్యమంత్రి, రాష్ట్ర వైకాపా అధ్యక్షులు వైఎస్ జగన్‌కు అరాచకవాదులు అంటే ఎనలేని ప్రేమ అని, అదికారంలో వున్న సమయంలో అరాచకవాదులతో ఒక కోటరిని ఏర్పాటు చేసుకుని రాష్ట్రంలో అరాచకాలకు పాల్పడ్డారని రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీల సురేంద్రకుమార్ ధ్వజమెత్తారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం జిల్లా తెలుగుదేశం కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్‌తో కలిసి రాష్ట్ర తెలుగుదేశం అధికార ప్రతినిధి వెంకిటీ సురేంద్రకుమార్ మాట్లాడుతూ సత్యవర్ధన్ అనే దళిత యువకుడిని కిడ్నాప్, దౌర్జన్యం చేసి హింసించడంతో వల్లభనేని వంశీ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారన్నారు. గతంలో సత్యవర్ధన్ ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కేసు విచారణ ప్రారంభం కావడంతో వంశీ సత్యవర్ధన్‌ను కిడ్నాప్ చేయించి అతనిపై దాడి చేసి బెదిరించారని తాను ఇచ్చిన ఫిర్యాదులను వెనక్కు తీసుకుంటున్నట్లు భయపెట్టి స్టేట్‌మెంట్ ఇప్పించి తద్వారా వంశీ ఈ కేసు నుండి బయటపడటానికి ప్రయత్నించారన్నారు. ఈ కిడ్నాప్‌కు సంబంధించిన వీడియోలు సైతం బహిర్గతం అయినప్పటికీ వాస్తవాలను వైకాపా నాయకులు వక్రీకరిస్తున్నారని ఆరోపించారు.

## ప్రభుత్వ భూముల జోలికెళితే కఠిన చర్యలు

'వార్త'కు స్పందన



పాలసముద్రం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:

పాలసముద్రం మండలం వనదుర్గాపురం గ్రామం తమిళనాడు సరిహద్దులోని ప్రభుత్వ భూములను ఎవరైనా ఆక్రమించుకోవడానికి ప్రయత్నిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసిల్దారు అరుణకుమారి హెచ్చరించారు. వనదుర్గాపురం గ్రామ పరిసరాల్లోని ఆంధ్రా ప్రభుత్వ భూములను తమిళ తంబిలు ఆక్రమించుకుంటున్నారని 'ప్రభాతవార్త'లో ప్రచురితం కావడంతో దీనిపై స్పందించిన తహసిల్దారు అరుణకుమారి ఆ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసిల్దారు మాట్లాడుతూ వనదుర్గాపురం గ్రామంకు తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దుగా వున్న ఆంధ్రా ప్రభుత్వ భూములను ఎవరైనా భూములు చదును చేసినా, మట్టిని అక్రమంగా రవాణా చేసిన కఠిన చర్యలు తీసకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు అరుణకుమారితోపాటు సర్వేయర్ గణేష్, విఆర్ఓ వెంకటాచలం, విలేజ్ సర్వేయర్ సోము పాల్గొన్నారు.

## నేడు బిసీ కార్పొరేషన్ రుణాల మంజూరుకు ఇంటర్వ్యూలు

తవణంపల్లె, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:

బిసీ కార్పొరేషన్ రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గురువారం ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. మండలంలోని వివిధ బ్యాంకుల ద్వారా బిసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడి రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుండి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికేట్‌లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన కోరారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

శాంతిపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



మండల కేంద్రమైన శాంతిపురంలో బిజెపి, జనసేన నేతల అధ్వర్యంలో సామ్రాట్ ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నేతలు గజేంద్ర, కిషోర్‌కుమార్, గోపి, కుమార్, రమేష్, సుబ్రమణ్యం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో మంచినీటి సమస్య తలెత్తకుండా చర్యలు

***శాంతిపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త*** వేసవి కాలంలో మండలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిడిఓ ప్రేమ్‌రాజ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం మండల కార్యాలయంలో ఆయన మంచినీటి సమస్యపై పిఆర్ డిఇ గురవారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ మండలంలో 124 పంపులు పనిచేస్తున్నాయన్నారు. ఎక్కడైనా రిపేర్లు తలెత్తితే తక్షణ మరమ్మత్తులకు బోరు మెకానిక్‌ను నియమించామన్నారు. పంచాయతీల్లో తాగునీటి బోర్ల మరమ్మత్తులను 24గంటల్లో చేపడుతున్నట్లు చెప్పారు. నీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు చేపట్టామన్నారు. తాగునీటి బోర్ల చుట్టూ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని ఏదేని సమస్యలు ఉంటే 9491071394నెంబరుకు ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.

## పారిశుద్ధ్య పనుల పట్ల ఆలసత్వం వద్దు

సోమల, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



కందూరు పంచాయతీలోని చెత్త నుండి సంపద తయారుచేసి కేంద్రాన్ని ఎంపీడీవో నారాయణ తనిఖీ నిర్వహించారు. ఈ ఓ ఆర్ డి తో కలిసి ఆయన పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పంచాయతీలో తడి పొడి చెత్త లను వేరువేరుగా సేకరించి తరలించాలని ఆయన తెలిపారు. పారిశుద్ధ్య పనులు చేయాలంటూ గ్రామ కార్యదర్శి జయశంకర్‌కు సూచించారు.

## మున్సిపల్ కార్మికులకు మెగా ఉచిత వైద్య శిబిరం

కుప్పం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



కుప్పం బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, శాంతి డెంటల్ క్లినిక్, లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో బుధవారం కుప్పం మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులకు కుప్పం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా బిఆర్‌డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఛైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ మెడిసిన్, దంత సమస్యలు, బిపి, చక్కెర వ్యాధికి సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు జరిపి మందులు, మా త్రలు పంపిణీ చేశారు. శిబిరంకు హాజరైన వారికి యువనేత హర్ష ధర్మతేజ్ భోజన వసతి సమకూర్చారు. కార్యక్రమంలో శాంతి డెంటల్ క్లినిక్ అధినేత డా॥ సుదర్శన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు జాకీర్, సోమశేఖర్, లయన్స్‌క్లబ్ బృందం మహేష్, పిజి సెల్వం, చరణ్, సెంధిల్, శివతేవర్, కృష్ణమూర్తి, బాలాజీ, నేతలు మంజు, రోజారాం, మణి, అమర్ తదితరులు పాల్గొన్నారు.

## హిందుధర్మపరిరక్షణ సమితిచే ఛత్రపతి శివాజీ జయంతి

కుప్పం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



కుప్పం హిందు ధర్మపరిరక్షణ సమితి అధ్వర్యంలో బుధవారం కుప్పంలో మహారాష్ట్ర రాజయోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శివాజీ సర్కిల్‌లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. జై భవాని జై శివాజీ అంటూ నినాదాలు చేశారు. అనంతరం అన ్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కెఇసిలో బిటెక్ మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదల

కుప్పం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ అటానమస్ హోదాలో జనవరి నెలలో నిర్వహించిన బిటెక్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు బిసిఎన్ గ్రూప్స్ ఛైర్మన్ బిసి నాగరాజ్ తెలిపారు. బుధవారం అనంతపురం జెఎన్‌టియు వర్సిటీ పరిశీలకులు ప్రొఫెసర్ చిత్ర, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, హెచ్ఒడి మాధవన్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సోమసుందరంలు పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. కాగా కంప్యూటర్ సైన్స్ విభాగంలో సుమిత్ర 93.6శాతం, జాహ్నవి పద్మప్రియ 93.5, మనోజ్‌కుమార్92.5శాతం మార్కులతో తొలి స్థానాల్లో నిలిచారన్నారు. అత్యధికశాతం విద్యార్థులు డిస్టింక్షన్, ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు ఛైర్మన్ బిసి నాగరాజ్ తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను ఛైర్మన్‌తో పాటు వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, సిఇఒ సాగర్ రాజ్‌లు అభినందించారు.

## రైతులకు యాభైశాతం రాయితీతో కూలర్ బాక్సులు

కుప్పం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త




పూలు, కూరగాయల సాగు చేసే రైతులకు ప్రభుత్వం యాభైశాతం రాయితీతో సబ్జీ కూలర్ బాక్స్‌లను పంపిణీ చేస్తోందని ఉద్యానవన అధికారి డింపుప్రియశ్రీ తెలిపారు. ఈ బాక్సులలో పూలు, కూరగాయలు ఉ ంచితే రెండు రోజులపాటు తాజాగా ఉంటాయన్నారు. ఈ బాక్సుకు ఎలాంటి కరెంట్ బ్యాటరీ అవసరం లేదన్నారు. కేవలం ఇరవై లీటర్ల నీటిని నింపితే చాలన్నారు. 25 కిలోల బాక్సు 21వేలు, 50కిలోల బాక్సు 39900, 100కిలోల బాక్సు 57వేల రూపాయలు అని రైతులకు యాభై శాతం రాయితీతో అందించడం జరుగుతుందన్నారు. వివరాలకు 773188159నెంబరును సంప్రదించాలని కోరారు.

## శాశ్వత నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

కాణిపాకం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు బుధవారం లక్ష రూపాయ లను విరాళంగా అందజేశారు. ఈమేరకు విజయ వాడకు చెందిన కళ్యాణ వెంకట గణపతి శాశ్వత నిత్యాన్నదాన పథకంకు 1,00,116 రూపాయ లను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొ త్తాన్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజి నాయుడులకు అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో జాయింట్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

తవణంపల్లె, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:

జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి బుధవారం మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈసందర ్భంగా రీసర్వే ఫైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసిన చెర్లోపల్లె రెవెన్యూ గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రీసర్వేను పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. తొందరపగి తప్పులు చేయకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించిన జెసీ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తవణంపల్లె తహశీల్దార్ కార్యాలయంను తనిఖీ చేశారు. ఈసందర ్భంగా ఆమె కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం కార్యాలయం, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించి ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని అర్జీలు వచ్చాయి? ఇప్పటి వరకు ఎన్ని సమస్యలు పరిష్కరించారు? అని అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలన్నింటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. అలాగే ప్రభుత్వ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో మండల తహశీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ రెడ్డిబాబు, మండల సర్వేయర్ మురళీకృష్ణలతో పాటు రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం



## ఉద్వేగంగా ఛత్రపతి జయంతి

పుంగనూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

పట్టణంలో ఛత్రపతి శివాజీ జయంతి బుధవారం ఉద్వేగ భరితంగా నిర్వహించుకున్నారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ భారతీయ పౌరుషానికి చత్రపతి కుటుంబం సంకేతం అన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ చివరి ఊపిరి వరకు విదేశీయులకు సింహ స్వప్నమై నిలిచారన్నారు. ఆయన కుమారుడు శంభాజీ మహారాజ్ బతకుడంగానే శవమయ్యేలా చిత్రవధలు అనుభవించిన సనాతన హైందవ ధర్మాన్ని కాపాడేందుకు స్థితిలో భస్మమై కూడా రగిలిపోయారన్నారు. స్థానికంగా యువత పెద్దలు కలిసి జై భవాని జై శివాజీ అనే నినాదాలతో సందడి చేశారు. యువతతో పాటు మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హిందూ జాగరణ సమితి సభ్యులు, త్రిమూర్తి రెడ్డి, సాయి, మహేష్, పరమేష్ ,కుమార్, వినాయక, బిజెపి నాయకులు, హిందూ సంఘాలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



పట్టణంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ప్రభుత్వ బసవరాజ బాలుర కళాశాలలో సిఎస్‌సిలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న సంతోష్ (17) స్నేహితులతో కలసి సమీపంలోని కత్తార్లపల్లెకు ద్విచక్ర వాహనంలో వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడడంతో సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో విద్యార్థికు గాయాలయ్యాయి. ఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని శవ పంచనామ నిమిత్తం పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మైనార్టీలకు అండగా ఉంటా: చల్లా రామచంద్రా రెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



నియోజకవర్గంలో ముస్లిం మైనార్టీ సోదరులకు అండగా ఉంటానని నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఉదయం అయినా మైనార్టీల అంజిమన్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. పుంగనూరు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి అరాచకాలు సృష్టించిన గతం ముగిసిపోయిందన్నారు. అనేక మంది మైనార్టీలపై కేసులు పెట్టిన నాయకులు నేడు పత్తా లేకుండా పోయారన్నారు. గత నాయకులు గత ప్రభుత్వం మైనార్టీలను నిలువునా ముంచేశారన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు తన అండగా ఉంటానని ఆయన హామీ ఇచ్చారు. పట్టణ మరియు చుట్టుపక్కల మైనార్టీ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొని రామచంద్రారెడ్డికి తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

## ప్రమాదాల నివారణకు హెల్మెట్ ధరించి, సీటు బెల్ట్ పెట్టుకోవాలి

పూతలపట్టు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త



ద్విచక్రవాహన దారులు హెల్మెట్, నాలుగు చక్రాల వాహనాలు నడిపే వారందరూ సీటు బెల్ట్ పెట్టుకుని సురక్షితమైన ప్రయాణం చేస్తూ ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని సీఐ కృష్ణమోహన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ, ఆదేశాల మేరకు మండల పరిధిలో ద్విచక్ర వాహనాలు హెల్మెంట్ ధరించకపోవడంతో చాలామంది రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలి అదేవిధంగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల పరిధిలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని, గంజాయి వినియోగించిన, అమ్మినా, పల్లెల్లో పాత కక్ష్యలతో గొడవల చేసిన వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరికలు చేశారు. ఎవరైనా మండల పరిధిలో పేకాట రాయులు గంజాయిపై సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకుంటామని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని వెల్లడించారు. సమస్యలపై మండల ప్రజలు, మహిళలు, యువకులు, రైతులు నిర్భయంగా పోలీసులకు ఫిర్యాదులు చేయవచ్చు అన్నారు.

## నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్‌కు ఇద్దరు విద్యార్థుల ఎంపిక



***కల్లూరు, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త*** 2024వ సంవత్సరం డిసెంబర్ 8వ తేదీన చిత్తూరులో నిర్వహించిన ఎన్.ఎం.ఎం.ఎస్ ప్రధాన పరీక్షను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లూరు నుండి 25 మంది విద్యార్థులు వ్రాయగా వారిలో ఇద్దరు విద్యార్థులు షాహిస్తా తబుసం, యశ్రబ్ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికైన సందర్భంగా విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు శ్రీవాణి, ఉపాధ్యాయులు వనపర్తి వెంకటసిద్దులు, రాజేంద్ర,వేణుగోపాల్, వెంకటరమణా రెడ్డి, నవాబ్ జాన్, గుర్రయ్య, మురళీమోహన్, పూల రాజేంద్ర అభినందించారు.

## పేకాటరాయుళ్ళు అరెస్ట్

తవణంపల్లె, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

మండలంలోని దిగువ తడకర వద్ద పేకాట ఆడుతున్న ముగ్గురు పేకాటరాయుళ్ళను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు తమ సిబ్బంది దిగువ తడకర గ్రామ సమీపంలో ముగ్గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుండి 4,600 రూపాయలు నగదు, ఒక ప్యాసింజర్ ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## యూనిక్ ఐడిని ఓటీపీతో నమోదు చేసుకోండి.

రొంపిచెర్ల, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త

రైతు సేవా కేంద్రాల్లో రైతు గుర్తింపు సంఖ్య కోసం వివరాలను రైతు ఓటీపీతో కూడా నమోదు చేసుకోవచ్చునని మండల వ్యవసాయాధికారిని సుధారాణి తెలిపారు. ఆమె బుధవారం బోడిపాటివారి పల్లి గ్రామపంచాయతీలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు యూనిక్ ఐడీ మీద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తో ఆన్ లైన్ చేసుకోవాలన్నారు. స్థానికంగా అందుబాటులో లేని రైతులు ఓటీపీతో కూడా నమోదు చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా ప్రతి రైతుకు రైతు విశిష్ట గుర్తింపు నెంబర్ వస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చే పథకాలు, ఆర్థిక సహాయం, ఈ యూనిక్ ఐడీ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పీఎం కిసాన్, పెట్టుబడి సాయం, పంట బీమా, సబ్సిడీ ఎరువులు, విత్తనాలు, యంత్రాలు, అన్నదాత సుఖీభవ, పంట రుణాలపై వడ్డీ రాయితీ యూనిట్ ఐడీ ద్వారానే వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సహాయ కేంద్రం ఇంచార్జి వెంకటరమణ నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మతిస్థిమితం లేని వ్యక్తి మనోబంధు ఫౌండేషన్‌కు అప్పగింత

శాంతిపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



మండలంలోని రాళ్లబూదుగూరు గ్రామంలో మతిస్థిమితం సరిగ్గా లేకుండా సంచరిస్తున్న ఓ వ్యక్తిని గ్రామ పెద్దల సమక్షంలో భీమవరంకు చెందిన మనోబంధు ఫౌండేషన్ వారికి అప్పగించారు. అతనికి కడప మానసిక ఆరోగ్య సంస్థకు తీసుకెళ్లి పునరావసం కల్పించాలని గ్రామస్తులు ఫౌండేషన్ వారిని కోరారు.

## వన్యప్రాణులకు హాని తలబెడితే చర్యలు తప్పవు

కుప్పంరూరల్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త



అటవీ గ్రామాల పరిధిలో ఎవరైనా వన్యప్రా ణులకు హాని తలపెడితే చర్యలు తప్పవని డిఆర్వో పుల్లయ్య పేర్కొన్నారు. బుధవారం రాత్రి మండలంలోని నాయనూరు బీట్‌లోని పార్వతీపురం, నాయనూరు గ్రామాల్లో అడవులు, వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని డిఎఫ్ఓ భరణి, ఎఫ్ఆర్వో జయశ ంకర్ ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈసందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ వేసవి కాలంలో అడవులకు నిప్పంటించడం వంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. అడవుల్లో ఉండే వన్యప్రాణుల సంరక్షణకు ప్రజలు తమవంతు సహకరించాలన్నారు. వన్యప్రాణులను వేటాడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి మురుగేష్, టిడిపి పంచాయతీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, ఎఫ్‌బిఓలు నరేంద్ర, బాబాజాన్, శరణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కార్పొరేషన్ రుణాలకు 21,24 తేదీల్లో ఇంటర్వ్యూలు

పెద్దపంజాణి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త

ప్రభుత్వం బిసి కార్పోరేషన్ ద్వారా అందించే బ్యాంకు రుణాలకు సంబంధించి దరఖాస్తుదారులకు ఈనెల 21,24 తేదీల్లో బ్యాంకర్ల సమక్షంలో ఇంటర్వ్యూలను మండల కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపిడిఓ బాలాజీ తెలిపారు. ఈనెల 21న రాయలపేట ఇండియన్ బ్యాంక్, పెద్దపంజాణి యూనియన్ బ్యాంక్ పరిధిలో ఉన్న వారికి, 24న శంకరరాయలపేట సప్తగిరి గ్రామీణ బ్యాంకు, పుంగనూరు ఎస్‌బిఐ, కల్లుపల్లి ఇండియన్ బ్యాంకుల పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు.

## తిరుపతిలో ప్రభుత్వ జూనియర్,డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయండి.

తిరుపతి విద్య ఫిబ్రవరి 19 ప్రభాత వార్త

తిరుపతి నగరంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పర్యటన నేపథ్యంలో ఆయనను ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్ కలిసి తిరుపతిలో ప్రభుత్వ జూనియర్,డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయాలని చెప్పి కోరడం జరిగింది. హేమాద్రి యాదవ్ నారా లోకేష్కి వివరిస్తూ తిరుపతిలో అనేకం ప్రభుత్వ స్కూల్స్, యూనివర్సిటీలు ఉన్నాయి గాని ప్రభుత్వ జూనియర్ డిగ్రీ కళాశాలలో లేవు దీనివలన పదవ తరగతి పాస్ అయిన వెంటనే తిరుపతి నగరానికి చెందినటువంటి విద్యార్థులు ఇంటర్, డిగ్రీలు చదవడానికి వారికి ప్రభుత్వ కళాశాల లేకపోవడం వల్ల తిరుపతి నగరంలో ఉన్నటువంటి పేద కుటుంబాలు చెందినటువంటి విద్యార్థులు ప్రైవేట్ కళాశాలలో చేరలేక,లక్షల్లో ఫీజులు చెల్లించలేక తిరుపతి నగరం నుంచి ఇతర నగరాల్లో ఉన్నటువంటి ప్రభుత్వ కళాశాలలో చేరి తిరుపతి నుండి అక్కడికి ప్రయాణిస్తూ వారి చదువులు కొనసాగిస్తున్నారు.కావున తిరుపతిలో వెలసినటువంటి టిటిడి విద్యాసంస్థలు ప్రస్తుతం ప్రైవేట్ కళాశాలగా రూపాంతరం చెందినాయి.కాబట్టి విద్యానగరంగా పేరుంది నటువంటి తిరుపతిలో ప్రభుత్వ కళాశాలలు లేకపోవడం బాధాకరం అని కావున తిరుపతిలో తక్షణం ప్రభుత్వ జూనియర్,డిగ్రీ కళాశాల స్థాపించి తిరుపతి నగరానికి చెందినటువంటి పేద విద్యార్థులకు ప్రభుత్వ ప్రభుత్వ విద్యను చదువుకునే దానికి అవకాశం కల్పించాలని ఏపీ స్టూడెంట్స్ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు హేమాద్రి యాదవ్, మంత్రివర్యులు నారా లోకేష్ కి వివరించడం జరిగింది. నారా లోకేష్ గారు స్పందిస్తూ తక్షణం దీని మీద నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఏపీ స్టూడెంట్స్ జేఏసీ జిల్లా అధ్యక్షులు గార్లపాటి శ్రీధర్,ఎస్వీ యూనివర్సిటీ అధ్యక్షులు మల్లి ఉపేంద్ర నగర అధ్యక్షులు వెంకటేష్.జిల్లా ఉపాధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరి వేసుకుని వలస కూలీ మృతి

**తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త** ఉరి వేసుకుని వలస కూలీ మృతి చెందిన సంఘటన తిరుపతి రూరల్ వెంకటపతి నగర్‌లో చోటు చేసుకుంది. తిరుపతి రూరల్ ఎస్ఐ అనిత వివరాల మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం, మహారాజ్ గంజ్ జిల్లా , భరత్ గడ గ్రామానికి చెందిన అనర్జిత్(28)గా గుర్తించామని తెలిపారు. తిరుపతి ప్రాంతాలలో 8 సంవత్సరాలుగా పెయింటర్‌గా కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు వెల్లడించారు. మృతుడు తమ్ముడు రాహ్మిత్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసాడు. కేసు నమోదు చేసి తిరుపతి రూరల్ ఎస్సై అనిత దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీకాళహస్తి రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత: పేరుకుపోతున్న ఫైళ్ళు

### సిబ్బంది లేకుండా పనులు ఎలా జరుగుతాయి?

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త




శ్రీకాళహస్తి రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత శాపంగా మారింది. 46 పంచాయతీలు 35 వార్డులకు సంబంధించిన ప్రజాపనులు పర్యవేక్షించాల్సిన రెవెన్యూశాఖలో సిబ్బంది లేకుండా పనులు ఎలా ముందుకు సాగుతాయి. దాంతో కార్యాలయంలో ప్రజా పనుల ఫైళ్ళు పేరుకుపోయాయి. ఓ వైపు రేషన్ కార్డులు,మరో వైపు భూ సమస్యలు, ఇంకోక వైపు ప్రభుత్వ పథకాలకు సర్టిఫికేట్లు కోసం జనం కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. అయితే సిబ్బంది కొరత శాపంగా మారింది. ముఖ్యంగా సిబ్బంది పరిస్థితి పరిశీలిస్తే ప్రతి పనికి లింక్ ఉన్న ఆర్ఐలు లేకకపోవటం గమనించదగ్గ విషయం. ఇక్కడి ఆలయంలో క్యాడర్ సిబ్బంది 17 మంది ఉండాల్సి ఉండగా కేవలం 7 గురు మాత్రమే ఉన్నారు.కీలకమైన ఫైళ్ళను క్లియర్‌చేయాల్సిన సిబ్బంది లేకుండా తహశీల్దార్ ఒక్కరే ఎలా పనులు చేస్తారు? పరిపాలనలో కీలకం రెవెన్యూ ఇన్స్పెక్టర్లు ఇద్దరు ఉండాల్సి ఉండగా ఇద్దరు చంద్రగిరికి బదిలి అయ్యారు. దాంతో ఇక్కడ పనులకు బ్రేక్ పడింది. తిరుపతిజిల్లా కలెక్టర్ కార్యాలయానికి అతిదగ్గర ఉన్న రెవెన్యూకార్యాలయంలో సిబ్బంది లేకున్నా పట్టించుకునే దిక్కులేదు.సివిల్ సప్లై డిటి లేదు.సీనియర్ ఎలక్షన్ ఆఫీసర్ లేదు.రెవెన్యూ సమస్యలు పరిశీలించే డిటి లేదు.చివరకు అటెండర్ ౹కూడా లేదు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో భూ సమస్యలు కొల్లలు,అలాగే గత పాలనలో ఫ్రీహోల్డ్ లాండ్స్ సమస్యలు కొల్లలుగా ఉన్నాయి. వెబ్‌ల్యాండ్ ఆపరేటర్ లేదు. ఏదైనా కార్యాలయానికి ఏమైనా సమాచారం పంపాలన్నా మెసెంజర్ లేదు.ఈ కార్యాలయం పరిధిలో 22 సచివాలయాలు ఉన్నాయి. అక్కడి సమస్యలు కూడా రెవెన్యూ కార్యాలయంతో ముడిపడి ఉన్నాయి.అన్నింటి కన్నా జటిలమైన సమస్య 'రాజీవ్‌నగర్'లో భూ సమస్యలు, భూదందాలు రాజ్యమేలుతున్నాయి. రెవెన్యూ కార్యాలయంలో బాధ్యత కల్గిన ఆర్ఐలు లేనందువల్ల దళారుల ఇష్టారాజ్యంగా మారింది. ఏ పనికి అయినా రెవెన్యూ కార్యాలయానికి వెళ్ళిన వారు సిబ్బంది లేక సీట్లన్ని ఖాళీగా ఉండటాన్ని గమనించి విస్తుపోతున్నారు.

## పేదల బడ్జెట్ కాదు ఇది కార్పొరేట్ల బడ్జెట్

- వామపక్ష నాయకులు నిరసన



**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1 తేదీ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల బడ్జెట్ కాదని ఇది కార్పొరేట్ల బడ్జెట్ అని సామాన్య, మధ్య తరగతి ప్రజలకు ఏ విధంగా ఏ మాత్రం ఉపయోగపడేగా లేదని సీపీఎం, సీపీఐ నాయకులు పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మొదటి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్యాయం చేస్తూనే ఉందని ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ప్రతిపక్ష నాయకుడు జగన్ కూడా ఈ బడ్జెట్‌పై మాట్లాడకపోవడం అత్యంత దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్ కార్యదర్శి వెంకటేష్, సీపీఐ పట్టణ కార్యదర్శి మహేష్, సీపీఐ నాయకులు బాబు, కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, సీపీఎం నాయకులు సుబ్రహ్మణ్యం, విజయ్, హరీష్, రమేష్, మాసనో తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు జ్ఞానజ్యోతి శిక్షణ

**పుత్తూరురూరల్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:**

ఏపీ ప్రభుత్వం ఈ విద్యను బలోపేతం చేయడంతో పాటు పాఠశాల విద్యకు అనుసంధాన పరిచే ప్రయత్నంలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి 120 రోజుల శిక్షణ కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం మొదటి దశలో ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా సెక్టోరల్ ఆఫీసర్ సారధి తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ సాల్ట్(సపోర్టివ్ ఆంధ్ర లర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్) ట్రైనింగ్‌లో భాగంగా 120 రోజుల శిక్షణ కార్యక్రమంలో తొలి విడత కార్యక్రమానికి మండలంలోని ఐసీడీఎస్, అంగన్‌వాడీ కార్యకర్తలనుద్దేశించి పసి పిల్లల వయసులోనే ప్రతి ఒక్కరికి కూడా ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసి అందించాలని కోరారు. కార్యక్రమంలోపుత్తూరు మండల విద్యాశాఖ అధికారులు తిరుమలరాజు, బాలసుబ్రహ్మణ్యం, సీడీపీవో సంధ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అనిత, గీతాంజలి, డీఆర్పీలు రమేష్, వెంకటేష్, భూపతి, సీఆర్పీలు పాల్గొన్నారు.

## మృతుడు తిరుమలరెడ్డి కుటుంబానికి

### హెచ్‌ఆర్‌సీఐ ప్రతినిధి బృందం వీర మహిళల ప్రగాఢ సంతాపం




**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** కర్నూలుకు చెందిన హ్యూమన్ రైట్స్ సౌత్ ఇండియా జనరల్ సెక్రటరీ, ఓ చానెల్ ప్రింట్ మీడియా రిపోర్టర్ తిరుమలరెడ్డిని కొంత మంది దుండగులు అతికిరాతకంగా చంపిన విషయం అందరికి విధితమే. ఈ సందర్భంగా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నడిమింటి చంద్రకళారెడ్డి ఆధ్వర్యంలో తిరుపతి హెచ్‌ఆర్‌సీఐ బ్రాంచ్‌లో బుధవారం మృతుడు తిరుమలరెడ్డి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. తిరుమలరెడ్డిని అతికిరాతకంగా చంపిన దుండగులను పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ బృందం సభ్యులతో పాటు వీరమహిళలు రమాదేవి, బిందు, శోభావతి, నాగరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు

## జెఈఈ మెయిన్స్‌లో ఎంజిఎం విద్యార్థుల ప్రతిభ

**తొట్టంబేడు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**



జెఈఈ మెయిన్స్ ఎంట్రన్స్ పరీక్ష ఫలితాల్లో 2025 జనవరిలో జరిగిన సెషన్-1 ఎంజిఎం జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనపరిచి ఏప్రిల్‌లో జరిగే జెఈఈ అడ్వాన్స్‌డ్‌కి అర్హత సాధించారు. ఈసందర్భంగా ఎంజిఎం మేనేజింగ్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య మాట్లాడుతూ జెఈఈ మెయిన్స్‌లో విద్యార్థులు ఈ.జీవన్‌హర్ష 86.94, కుమారి ధామ వాసవి 86.87, కుమారి గోరంట్ల చరిష్మా 79.82, కె.ఆర్. సతీష్‌రాజ్ 62.00 శాతం సాధించినందుకు విద్యార్థులను పుష్పగుచ్ఛంతో అందించి అభినందించారు. అదేవిధంగా ఏప్రిల్‌లో జరిగే జెఈఈ అడ్వాన్స్‌కి ఇదేవిధంగా మెరుగైన ఫలితాలు సాధించి కళాశాలకు మరియు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంజిఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు ఐశ్వర్య మరియు కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్.రత్నం మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

**తొట్టంబేడు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**

యంగ్‌ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో వచ్చేనెల 1వ తేదీ నుంచి ఇంటర్ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రాబోవువాతావరణంలో విద్యార్థుల్లో ఉన్న మానసిక ఒత్తిడి, భయాందోళనలను పోగొట్టడానికి విద్యావ్యవస్థతో ప్రత్యేకమైన అనుబంధమున్న మరియు ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడంలో నిష్ణాతులు మరియు అరబిందో సంస్థ నందు శిక్షణ పొందిన జడ్.సుమన్ విద్యార్థులు మోటివేషన్ క్లాస్ నిర్వహించడంతో పాటు విద్యార్థులకు అవసరమయ్యే పరీక్ష సామగ్రి తదితర వస్తువులను విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సంస్థ అధ్యక్షులు హేమకుమార్ మాట్లాడుతూ తెలుగుగంగ కాలనీలోని ట్రైబల్ రెసిడెన్సియల్ స్కూల్(ఏపిటిడబ్ల్యుఆర్ఎస్) బాలికల పాఠశాలలో చదువుతున్న వారికి మౌళిక వసతులను కల్పిస్తాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరగుతోందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ దామోదర్‌నాయుడు, వైస్ ప్రిన్సిపల్ లలిత, యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సభ్యులు నారాయణ, ప్రదీప్‌కుమార్, చంద్రకాంత్, శ్రీనివాసులు, అంజయ్య, రాజశేఖర్, శివ, రమణ తదితరులు పాల్గొన్నారు.

## నారాలోకేష్‌ను కలసిన రెడ్డివారి గురవారెడ్డి

**.శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**



రాష్ట్ర యువనేత ఐటి, మరియు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ తిరుపతిలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొనడానికి విచ్చేసినటువంటి ఆయన్ను మర్యాదపూర్వకంగా రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారిగురవారెడ్డి స్వాగతం పలికి శ్రీకాళహస్తీశ్వరస్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, మహాశివరాత్రికి చేస్తున్న ఏర్పాట్లుకు సంబంధించి వివరాలను తెలుసుకున్నారు.

## ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**



ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని శ్రీకాళహస్తి ఆరే మరాఠా అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ద స్కూల్ ప్రాంగణంలో ఉన్న స్వర్గీయ శాంతారాం రావు జె.పవార్ విగ్రహం వద్ద శివాజీ చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పివిఆర్ గ్రూప్ డైరెక్టర్‌జనార్ధన్‌రావు జె.పవార్‌మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం, ధర్మస్థాపన కోసం ఆయన ఎంతోపోరాటం చేసారన్నారు. కార్యక్రమంలో పడోల్కర్ మహేశ్వర్‌రావు, ఎస్.భాస్కర్‌రావు, దయానందరావు, సదారాం, హరిరావు, ప్రసన్నరావు, గోవర్ధన్‌రావు, రాజశేఖర్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

**.శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ 395 జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ నేతృత్వంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించారు. బిజెపి, విశ్వహిందూపరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్, భజరంగ్‌దళ్, అఖిలభారత విద్యార్థి పరిషత్, పుర ప్రముఖులు మరియు వివిధ పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సిసి విద్యార్థులందరు కలసి స్థానిక బేరివారి మండపం వద్ద నుంచి బయలుదేరి శివాజీ మహారాజ్ చిత్రపటాన్ని ఊరేగింపుగా నాలుగు మాడవీధులల్లో ప్రదర్శన చేస్తూ ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలు నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ విజయవంతంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ మరియు భరణికృష్ణలు పాల్గొన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రమణ్యంరెడ్డి, బాలసుబ్రమణ్యం, కె.సుబ్రమణ్యంరెడ్డి, సురేష్, సుబ్రమణ్యం, దొరబాబు, ఎస్వీరమణ, మండల అధ్యక్షులు హరీష్‌రెడ్డి, వేదాంకృష్ణయ్య, వెంకటేష్, సుకుమార్, సుధాకర్, కొండేలిగోపాల్, ఎల్.గోపాల్, కోనేటి అయ్యప్ప, పుణ్యండిల్లీకుమార్, కనపర్తిరవితేజ, కటికం చందురాయల్, భరత్‌నాయుడు, యుగంధర్, యతీష్, సింగమాల కుమార్, బిందుకుమార్, డిల్లీ, సిద్ధూ, యుగంధర్, యతీష్, సింగమాలకుమార్, బిందుకుమార్, డిల్లీ, సిద్ధూ, శ్రీనివాస్, చైతన్య, గిరిధర్‌సాయి, నాని , పవన్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళ మెడలో చైన్ చోరీ

**వడమాలపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:**

మోటారు బైక్‌పై వచ్చిన ముగ్గురు యువకులు మహిళ మెడలో చైన్ లాక్కెళ్లిన సంఘటన వడమాలపేట మండలం సీతారామపురం వద్ద బుధవారం జరిగింది. వడమాలపేట ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు... సీతారామపురంలో పోస్టు మాస్టర్‌గా పని చేస్తున్న భారతి డ్యూటీ ముగించుకుని పుత్తూరుకు వెళ్లేందుకు రోడ్డు పక్కన ఉన్న చిల్లర దుకాణం వద్ద కూర్చుని ఫోన్ చూసుకుంటూ ఉంది. అదే సమయంలో ముగ్గురు వ్యక్తులు డ్యూక్ బైక్ పై వచ్చి అంగడికి కొంత దూరంలో వాహనం నిలిపి అందులో ఒకరు అంగడికి వచ్చి కూల్‌డ్రింక్స్ కావాలని అడిగాడు. షాపులో ఉన్న ఆమె ఫ్రిడ్జి వద్దకు వెళ్లి కూల్‌డ్రింక్స్ తీసే సమయంలో ఆ వ్యక్తి కూర్చొని ఉన్న భారతి మెడలోని బంగారు హారం, నల్లపూసలు లాక్కొని బైక్ ఎక్కి బాదూరు రోడ్డులో వెళ్లిపోయారు. ముగ్గురు వ్యక్తులు ఆచూకీ తెలిస్తే పుత్తూరు రూరల్ సర్కిల్ 9440900010, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వడమాలపేట 9440736729కు తెలియజేయాలని వారు కోరారు.

## వచ్చేనెల 10 లోపు డిగ్రీ పరీక్షలకు ఫీజు చెల్లించాలి

***తిరుపతి విద్య ఫిబ్రవరి 19 ప్రభాత వార్త*** ఎస్వీయూ పరిధిలో మార్చిలో ప్రారంభం కానున్న డిగ్రీ రెండవ, నాల్గొవ, ఆరవ సెమిస్టర్ పరీక్షలకు సంబంధించి ఫీజు వచ్చేనెల 10లోపు చెల్లించాల్సి ఉంటుందని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. యూజీకి సంబంధించిన అన్ని కోర్సుల 2, 4, 5 సెమిస్టర్ పరీక్షలు మార్చి, ఏప్రిల్ మధ్య నిర్వహించనున్న నేపథ్యంలో పరీక్షల రుసుము గడువు తేదీలోపు చెల్లించాలని సూచించారు. అపరాధరుసుము రూ.500 చెల్లించి వచ్చేనెల 17వరకు ఆన్లైన్లో ఫీజు చెల్లింపునకు అవకాశం ఉంటుందని తెలియజేశారు. అలాగే ఆన్లైన్ అప్లికేషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ గురువారం నుంచి అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఇప్పటికే వర్సిటీ పరిధిలో అన్ని కళాశాల ప్రిన్సిపాల్స్ కు సమాచారం అందించామని పేర్కొన్నారు.

## పీజీ పరీక్షా ఫలితాలు విడదల చేయరా....!



***తిరుపతి విద్య ఫిబ్రవరి 19 ప్రభాత వార్త*** ఎస్వీయూ పరిధిలో గత ఏడు నెలలకు ముందు జరిగిన పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు ఇంతరవకు విడుదల చేయకపోవడం దారుణమని ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వీసీ అప్పారావు ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్వీయూలో సెమిస్టర్ సిస్టమ్ ప్రారంభమైన నాటి నుంచి సక్రమంగా ఫలితాలు విడుదల చేయడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో ఎంతో మంది విద్యార్థులు నష్టపోతున్నారని ఆవేధన వ్యక్తం చేశారు. పెండింగ్లో ఉన్న తొలి, రెండవ, మూడవ సెమిస్టర్ ఫలితాలు సైతం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ వర్సిటీ అధ్యక్ష కార్యదర్శులు నరేంద్ర, వినోద్. నాయకులు మధు, సాయి, జగదీష్, సాయి, సతీష్, హాసినిలు పాల్గొన్నారు.

## గందరగోళంగా సర్వసభ్య సమావేశం

**విజయపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:**



గందరగోళంగా మండల సర్వసభ్య సమావేశం బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జమున అధ్యక్షతన జరిగింది. పంచాయతీ తీర్మాణం లేకుండా పనులు ఎలా చేస్తారంటూ పన్నూరు దళితవాడ సర్పంచ్ కుమార్ పంచాయతీరాజ్ ఏఈపై ధ్వజమెత్తారు. గ్రామంలో అభివృద్ధి పనులను స్వాగతిస్తున్నామని మాకు తెలియజేసి అభివృద్ధి చేయాలని, లేదంటే కోర్టును ఆశ్రయించాలని కోరారు. మండలంలో గోకులం షెడ్లు 51 మంజూరైతే సర్పంచ్‌కు సమాచారం లేకుండానే పనులు చేస్తున్నారని, సర్పంచ్‌లు ఎల్లప్పుడు అభివృద్ధినే కోరుకుంటారని తెలిపారు. విజయపురం దళితవాడలో నెలరోజుల పాటు ఉపాధి పనులు నిర్వహించడం లేదని, పంచాయతీ తీర్మాణం లేకుండా క్షేత్ర సహాయకులను మార్చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు టీడీపీకి ఏకపక్షంగా పనులు చేస్తున్నారని బూచివానత్తంఎంపీటీసీ రాజగోపాల్ ఆరోపించారు. కోసలనగరం ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. సర్వసభ్య సమావేశానికి భార్యలకు బదులు భర్తలు రావడం వలన సమస్య ఉత్పన్నమవుతున్నదని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. అనంతరం పలు సమస్యలపై సమీక్షించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ బాలాజీ, జడ్పీటీసీ రేవతి, తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, ఏవో రజనికుమారి, ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, పీఆర్ఏఈఈ వీరభద్రం, వైద్యాధికారి సోమశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

## భీమునిచెరువు సర్పంచ్ మురుగేశం మృతికి ఘన నివాళి

**నారాయణవనం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :**



నారాయణవనం మండలం భీమునిచెరువు గ్రామ పంచాయతీ సర్పంచ్ వి మురుగేశం అలియాస్ రజని (44) ఈనెల 9వ తేది ఆదివారం రాత్రి జరిగిన రైలు ప్రమాదంలో మృతి చెందారు. ఆయనకు బుధవారం శుభస్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్‌కుమార్, ఎంపిపి పి దివాకర్‌రెడ్డిలు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

## మంత్రికి కలంకారి కళాఖండం బహూకరణ

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి అంటే కలంకారి గుర్తుకు వస్తుందన్నారు. బుధవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కుటుంబసభ్యులతో వాయు లింగేశ్వరుని దర్శనానికి వచ్చారు. వారికి బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు. కాగా స్వామిఅ మ్మవార్లను దర్శించుకున్న వారికి శ్రీకాళహస్తి అంటే గుర్తుకు వచ్చే కలంకారి కళాఖండాన్ని బొజ్జల రిషితారెడ్డి అందించారు. శ్రీకాళహస్తిలో కలంకారి కళ అభివృద్ధి ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించారు. ఈ కళను కాపాడటానికి కళాకారులను ఆదుకోవటానికి సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో తేజోభారత్ ఫౌండేషన్ అధ్యక్షురాలు ఆనంద్ సతీమణి కోలా విశాలాక్షి శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డిలు అందజేసారు.

## స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలు

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు దాతలు భూరి విరాళాలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మదనపల్లికి చెందిన జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల అధినేత రాటకొండ గురుప్రసాద్ దంపతులు పట్టు వస్త్రాలను అందించారు. ప్రతి ఏడాది గురుప్రసాద్ దంపతులు స్వామి అమ్మవార్లకు పట్టు వస్త్రాలను అందించే సంప్రదాయం ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం అందించారు. పట్టు వస్త్రాలను ఇఒకు అందించారు.

## పన్ను వసూళ్ళుకు కమిషనర్ పరుగులు

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారులు మార్చి వస్తుందంటే పన్నుల వసూళ్ళకు పరుగులు. ఓ వైపు పన్నుల వసూళ్ళు మరో వైపు ట్రేడ్ టాక్స్‌ల వసూళ్ళకు పరుగులు తీస్తుంటారు. ఈ నేపథ్యంలో బుధవారం కమిషనర్ బియస్ గిరికుమార్ తన సిబ్బందితోకలసి పన్నుల వసూళ్ళకు పరుగులు తీసారు. పెద్ద మొత్తాల్లో ఉన్న పన్ను దారుల నుంచి ముందు వసూళ్ళకు నిర్ణయించారు. ఓ వైపు పన్నులు మరో వైపు ప్రభుత్వ కార్యాలయాల వసూళ్ళకు సంబంధించి ప్రణాళికలు రూపొందించుకొని వసూళ్ళు చేస్తున్నారు. కమిషనర్ పన్నుల వసూళ్ళకు ప్రత్యేక టీంను ఏర్పాటు చేసారు. వారు ఉదయం 8గంటల నుంచే వసూళ్ళకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటి వరకు 38శాతం పన్నులను వసూళ్ళు చేసినట్లు తెలిసింది. కమిషనర్‌తో పాటు రెవెన్యూ అఫీసర్ ఖాదర్‌మొహిద్దీన్, ఆర్ఐ దుర్గం సోమశేఖర్, అడ్మిన్ కార్యదర్శి యం.పార్ధసారధి, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

## ఉమ్మడి కమ్యూనిస్టుల ధర్నా

**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త**




కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ మిలీనియర్ల బడ్జెట్ అని నిరుపేదలకు మొండిచేతులు చూపిందని ఉభయ కమ్యూనిస్టులు ఆందోళన చేసారు. బుధవారం పట్టణంలోని ఆర్టిసి బస్టాండు సర్కిల్‌లో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేసారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ ఆదాని, అంబానిలాంటి పెట్టుబడి దారులకు 30 నుంచి 22శాతానికి కార్పొరేట్ పన్నులు తగ్గించారన్నారు. ఆహార సబ్సిడీకి రూ.10వేల కోట్లు రైతులకిచ్చే సబ్సీడీలపై 20వేల కోట్లు తగ్గించారన్నారు. ఎపికి చెందిన ఎంపిల శ్వాసతో జీవిస్తున్న కేంద్ర ప్రభుత్వం బీహార్‌కు నిధులు కేటాయించి ఆంధ్ర ప్రదేశ్ నోట్లో మట్టి కొట్టిందన్నారు. ఈ కార్యక్రమాల్లో సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, పెనగడం గురవయ్య, రాధమ్మ, గోపి, శివ, చారులత, చందమామలకోటయ్యలు పాల్గొన్నారు.

## నాబిడ్డ మృతిపై అనుమానాలున్నాయి! న్యాయం చేయండి:

***శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 19ప్రభాతవార్త***

శ్రీకాళహస్తి మండలంలోని కలవగుంటకు దళితవాడకు చెందిన మంగమ్మ మృతిపై పలు అనుమానాలున్నాయని విచారించి న్యాయం చేయాలని బాధితురాలి తల్లి నరసమ్మ బుధవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆమె ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. రాజుగుంట దళితవాడకు చెందిన కట్టుకూరు రామయ్యతో 13 సంవత్సరాల క్రిత మంగమ్మకు వివాహం చేసినట్లు నరసమ్మ వివరించారు. తన బిడ్డకు ఓ కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. అయితే ఈ నెల 7న మృతి చెందిన తన కుమార్తె తనకు ఫోన్ చేసిందని తనకు అత్తింటి లో ఇబ్బందులు ఎదురౌతున్నాయని డబ్బులు కావాలని బ్యాంకులో రుణంగా వచ్చిన సొమ్మును తెమ్మని అత్తారింటిలో అత్తా, మామ, మరిదిలు వేధిస్తున్నారని ఏడుస్తు మాట్లాడిందన్నారు. 9వ తేది గ్రామానికి చెందిన వాళ్ళు తనకు ఫోన్ చేసి తనకుమార్తె ఉరి వేసుకొని మృతి చెందినట్లు వివరించారు. అయితే అత్తింటి వారు హడావిడిగా దహన క్రియలు జరిపించారని అయితే అప్పటిలో తనకు సందేహం లేదని తరువాత విచారిస్తే అత్తింటి వాళ్ళె చంపేసి ఉరి వేసుకున్నట్లు సృష్టించారని పోలీసులకు ఫిర్యాదుచేసినట్లు విలేకరులకు తెలిపారు. ఈ సంఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరినట్లు తెలిపారు. అయితే ఈ సంఘటనకు సంబంధించి రూరల్ సిఐ రవినాయక్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

# తిరుపతి డివిజన్

## శింగరికోన లక్ష్మీనరసింహుని సన్నిధిలో స్వాతి నక్షత్ర పూజలు



**నారాయణవనం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :** మండలంలోని వెంకటకృష్ణాపాలెం పంచాయతీ నాగిలేరు గ్రామపరిధిలోని శింగిరికోనలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయ ంలో బుధవారం స్వాతి నక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని శుద్ధి, నిత్యకైంకర్య పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను సుగంధద్రవ్యాలతో అభిషేకం చేశారు. స్వామివారి జన్మ నక్షత్రం కావడంతో జిల్లా నలుమూలల నుంచే కాకుండా తమిళనాడు నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ ఛైర్మన్ పి గుణవంతరావు, సభ్యులు పి గిరిబాబు, భాస్కర్‌బాబు, మధు, అర్చకులుహరిబాబుస్వామి, శరవణ, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

**రామచంద్రాపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త :**




ఆధునాతన సాంకేతిక పద్ధతులను అవలంబించడం ద్వారా నూతన ఔషధ అభివృద్ధి ప్రక్రియ వేగవంతం అవుతుందని బెంగుళూరు అల్-అమీన్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.డి సలాహుద్దీన్ తెలిపారు. వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాలలో బుధవారం రోజున డ్రగ్ డిస్కవరీ అండ్ డెవలప్‌మెంట్ కోసం అధునాతన సాంకేతిక పద్ధతులు అనే అంశంపై సెషన్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా సలాహుద్దీన్ మాట్లాడుతూ నిరంతరం పెట్టుబడి, సహకారంతో, సంచలనాత్మక ఆవిష్కరణల సంభావ్యత అపరిమితంగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నిరంజన్ బాబు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణల వైపు విద్యార్థులు అడుగులు వేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల అకడమిక్ అడ్మినిస్ట్రేటర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, అకడమిక్ డైరెక్టర్ శరవణ కుమార్, బోధన సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైసీపీ కార్యకర్త సామ్రాజ్ తండ్రి రామచంద్రన్ మృతి



***నాగలాపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:*** వైసీపీ కార్యకర్త సామ్రాజ్ తండ్రి రామచంద్రన్ మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న సత్యవేడు సమన్వయకర్త నూకతోటి రాజేష్ స్థానిక వైసీపీ నాయకులతో కలసి సామ్రాజ్ ఇంటికి చేరుకుని రామచంద్రన్ మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం సామ్రాజ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు మండల అధ్యక్షుడు అపరంజిరాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదొరై, సుధ, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేపు స్వయం ఉపాధిపథకంపై ఇంటర్వ్యూలు

**సత్యవేడు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:**

సత్యవేడు మండలంలో 21 తేదీ స్వయం ఉపాధి పథకంలో లబ్దిదారులను ఎంపిక చేయడానికి దరఖాస్తు దారులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ 2024-25 సంవత్సరానికి సంబంధించిన స్వయం ఉపాధి పథకంలో దరఖాస్తు చేసుకున్న వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

## మంత్రి లోకేష్‌ని కలసిన క్లస్టర్ ఇన్‌చార్జి మునస్వామి యాదవ్



***కేవీబీ పురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:*** బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించడానికి తిరుపతికి విచ్చేసిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ని కేవీబీ పురం మండల సీనియర్ నాయకుడు, రాష్ట్ర బీసీసెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్ మర్యాదపూర్వకంగా కలశారు. అనంతరం సత్యవేడు నియోజకవర్గ తాజా రాజకీయ పరిస్థితులను లోకేష్ అడిగితెలుసుకున్నారు. ఆయనతోపాటుటీడీపీ సీని యర్ నేత తిమ్మసముద్రం సర్పంచ్ దొరబాబునాయుడు, ఓలూరు సర్పంచ్ సురేష్ చౌదరి, తిరుపతి పార్ల మెంట్‌పాలేగార్ అధ్యక్షుడు వెంకటకృష్ణయ్య, పవనవారి కండ్రిగ సర్పంచ్ చెంచుప్రకాష్ యాదవ్ ఉన్నారు.

## కలెక్టర్‌కు ఎస్సీసెల్ అధ్యక్షుడు సాధు వినతి

**కేవీబీ పురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త:**

కేవీబీ పురం మండలం కళత్తూరు పంచాయతీ భూ సమస్యను పరిష్కరించవలసిందిగా తిరుపతి జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందించి రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల గురించి గత 15 సంవత్సరాల నుంచి వ్యవసాయం చేసుకుంటూ దాని మీద ఆధారపడుతూ కళత్తూరు రైతులు జీవనం సాగిస్తున్నారని సత్యవేడు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సాధు తెలిపారు. కలెక్టర్ అనుమతితో ఈ సీజన్‌లో పంట సాగు జరిగింది. ఈ సీజన్‌లో పండించిన పంట వలన రైతుల నష్టపోవడంతో కొంత మంది రైతులు ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని తెలిపారు.

## అన్వేషణ-25 కూ ఎస్వీయూ బృందం



**తిరుపతి విద్య ఫిబ్రవరి 19 ప్రభాత వార్త**

కర్ణాటక రాష్ట్ర రామయ్య విశ్వవిద్యాలయం నందు జరిగే "శాస్త్రీయ పరిశోధన, ఆవిష్కరణ ల అంతర్జాతీయ విద్యార్థులు పోటీ" కార్యక్రమం కూ కల్చరల్ కోఆర్డినేటర్ డా పత్తిపాటి వివేక్ ఆధ్వర్యంలో సంజయ్ కుమార్, భవ్య శ్రీ, దీప్తి, జాస్మిన్ ల బృందం బుధవారం బెంగళూరుకి పయనమయింది. ఈ బృందం ఎస్వీయు ఉపకులపతి ఆచార్య అప్పారావు నూ ఆయన చాంబర్లో మర్యాదపూర్వకం గా కలిశారు. ఈ సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలుపుతూ పోటీ కార్యక్రమంలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పద్మావతి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డా భువనేశ్వరి, డా పాకనాటి హరికృష్ణ, అధ్యాపకులు కుసుమ, శరత్ బాబు పాల్గొన్నారు.

## ఎస్ జి ఎస్ కళాశాలలో చత్రపతి శివాజీ జన్మదిన వేడుకలు.

**తిరుపతి విద్య ఫిబ్రవరి 19 ప్రభాత వార్త**

చత్రపతి శివాజీ జయంతి ఉత్సవాలను చరిత్ర విభాగం ఆధ్వర్యంలో ఎస్ జి ఎస్ ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా నిర్వహిం చడం జరిగింది. ముఖ్యఅతిథిగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్. బి. సత్యనారాయణ విచ్చేసి చరిత్రలో శివాజీ స్థానము అతని విజ యాలు, తల్లి దండ్రుల పట్ల తనకున్న ప్రేమ, స్త్రీల పట్ల ఉన్న గౌరవము, మతసా మరస్యము, హిందూ ప్రజల జాతికి అతను అందించి నటువంటి సేవలను కొనియాడారు. విరోచి త పోరాటాలను అతని సాధించిన విజయా లను ప్రతి ఒక్క విద్యా ర్థి తెలుసు కోవాలని తెలిపారు. ఈ కార్యక్ర మంలో చరిత్ర విభా గం అధ్యక్షులు కత్తి భాస్కరన్, అధ్యాప కులు జే కొండల రావు, చంద్ర య్య, వెంకట రమణ మ్మ, ఎస్ అనిల్ కుమార్, ప్రదా రెడ్డి, ప్రియాసింగ్, వి. మని, ఎన్ వినోద్, విద్యా ర్థులు పాల్గొన్నారు.


**Municipal Corporation:Tirupati**

The Commissioner, Municipal Corporation, Tirupati invites Tender on e-Procurement platform from the "eligible contractors" for the following works.

| IFB No. | Name of the work | No.of works | ECV amount in Rupees in lakhs |
|---|---|---|---|
| IFB No. 02, Recall & 222 to 264/GEN/24-25/TO, Date: -02-2025 | Providing Thermoplastic painting, Restoration of UDS line, Repairs and maintenance of Motors, Laying of CC Patches, S/D and fixing of Pillor cock, Laying of Roofing Sheets, Repairs to MEPMA Building, Hiring of Excavators, Repairs and Painting for play items, S/D of Street lighting and Motors & Specials, Providing barbed wire fencing, Swatch Survekshan painting works, Temporary CI sheet boundary, Laying of CC Patches pipeline, Construction and extension of CC drains Removal of silt, Drilling of bore, replacement of UGD and providing third party (RFP) | 53 works | 319.21 |
| Total | | 53works | 319.21 |

' For particulars please contact Municipal Engineer during office working hours (or) see e-Procurement market place :
**https://tender.apeprocurement.gov.in.**

**Commissioner,
Municipal Corporation, Tirupati**

## కండలేరు వాటర్‌గ్రిడ్‌పై సర్వే



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : కండలేరు నుంచి వాటర్ గ్రిడ్‌ను నిర్మించేందుకు జరుగుతున్న ప్రక్రియలో భాగంగా గూడూరు డివిజన్‌లో 14, నెల్లూరు డివిజన్‌లో 9 మండలాల్లో ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో సర్వే బుధవారం చేపట్టారు. ఇందులో భాగంగా పడమటికండ్రిగ టిబిఎం 225 వద్ద నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభించారు. అలాగే దొరవారిసత్రం మండలం కల్లూరు వద్ద సర్వే చేపట్టారు. ఈ ప్రాజెక్టుకు 4,600 కోట్లు వ్యయం అవుతుందని అధికార బృందం తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ ఆరూరు చంద్రశేఖర్, ఏఇలు ఉమామహేశ్వరి, ప్రకాష్, భవాని తదితరులు పాల్గొన్నారు.

## చెరువు భూమిలో విద్యుత్ కనెక్షన్లు!



దొరవారిసత్రం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం అక్కరపాక గ్రామ చెరువు భూములను ఆక్రమించి కొంత మంది భూ కబ్జాదారులు రియల్ ఎస్టేటు వెంచర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అక్కరపాక గ్రామ ప్రజలు వాపోతున్నారు. చెరువు భూమిలో ఏర్పాటు చేస్తున్న అనధికారిక వెంచర్లకు కొంతమంది విద్యుత్‌శాఖ అధికారులు డబ్బులు తీసుకుని నిబంధనలను తుంగలోతొక్కి చెరువు భూమిలో కరెంటు స్తంభాలు ఏర్పాటు చేసి,మీటర్లు కూడా పెట్టారని గ్రామ ప్రజలు తెలిపారు. దొరవారిసత్రం మండల విద్యుత్‌శాఖ అధికారులకు అనధికారికంగా అక్కరపాక చెరువు భూమిలో ఏర్పాటు చేసిన కరెంటు స్తంభాలను తొలగించాలని పలు మార్లు గ్రామ ప్రజలు కోరిన పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. రూల్స్,నిబంధనలు పక్కనపెట్టి చెరువు భూమిలో కరెంటు కనెక్షన్లు, కరెంటు స్తంభాలను తొలగించి చెరువు భూములను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## నేడు పేటలో దోమల నిర్మూలన : కమిషనర్

నాయుడుపేట పిబ్రవరి 19 ప్రభాతవార్త ; నాయుడుపేట పట్టణంలో గురువారం దోమల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్లు మున్సిపాల్టి కమిషనర్ పజులుల్లా ఓప్రకటనలో తెలిపారు. ఈకార్యక్రమానికి సూళ్ళూరుపేట శాసనసభ్యులు డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గోని ప్రారంభించడం జరుగుతుందన్నారు. నాయుడుపేట పట్టణంలోని కరెంటు ఆఫీసు,విన్నమాల కాలువ,నీరు అధికంగా నిల్వఉన్న కాలువలపై డ్రోను సహాయంతో దోమల మందు స్ప్రేచేయుడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో ప్రజలు అందరు భాగస్వామ్యం కావాలని ఆయన సూచించారు.

## కోటలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కోట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : కోటలోని ఎవికెఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక షాదీమంజిల్‌లో బుధవారం జరిగింది. 1980-81 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు 44 ఏళ్ల తర్వాత విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. ప్రస్తుతం ఆ విద్యార్థులంతా వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. అపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనానికి ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేంద్రబాబు అధ్యక్షత వహించారు. విశిష్ట అతిథులుగా విశ్రాంత ఉపాధ్యాయులు చిట్టమూరు భాస్కర్‌రెడ్డి, రఘురామిరెడ్డి, పోలంరెడ్డి శేషమ్మ, నరసింహులును పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు పాఠశాలకు 20 బెంచీలు, గేటు మరమ్మతులు, క్రీడల సదుపాయం కల్పించినట్లు ప్రధానోపాధ్యాయులు సురేంద్రబాబు చెప్పారు. ఈ కార్యక్రమం లాయర్ వల్లం సురేంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. మైధిలి హాస్పిటల్ ఎండి రమణ బాబు, సుబ్రహ్మణ్యం, గణపర్తి చంద్రప్రసాద్ నాయుడు, సురేంద్రనాథ్‌రెడ్డి, పల్లం కృష్ణయ్య, గంగపట్నం విజయభాస్కర్‌రెడ్డి, కర్లపూడి శ్రీనివాసులు, దువ్వూరు రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పెన్నక్క చెరువులో చేప పిల్లలు విడుదల

కోట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెంలోని పెన్నక్క చెరువులో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు పిఎంఎం ఎస్‌వై పథకం ద్వారా 12 లక్షల చేప పిల్లలను మత్స్యశాఖ అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు సంయుక్తంగా వదిలారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ మాట్లాడుతూ గిరిజన సొసైటీ ద్వారా మత్స్యకార కుటుంబాలు చేపలను పట్టుకోవచ్చని తెలిపారు. కూటమి ప్రభుత్వం గిరిజనులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగరాజు, ఏడి రాజేష్, ఎఫ్‌డిఓ రెడ్డినాయక్, తహశీల్దార్ కె.జయజయరావు, ఎంపిడిఓ వేణు, టిడిపి నాయకులు చిల్లకూరు దశరధరామిరెడ్డి, పలగాటి భాస్కర్‌రెడ్డి, మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, షేక్ షంషుద్దీన్, దారా సురేష్, పలగాటి జితేంద్రరెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, నెల్లూరుపల్లి కొత్తపాలెం జలసంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి, మత్స్యకార కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌సిసి విద్యార్థులకు అభినందనలు

కోట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో ద్వితీయ సంవత్సరం ఎన్‌సిసి విభాగం క్యాడెట్లు ఎం.ప్రణీత్ ఈ ఏడాది ఢిల్లీలో జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్రపతి, ప్రధానమంత్రి సమక్షంలో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చూపి బహుమతి గెలుపొందాడు. అలాగే అమరావతిలో గవర్నర్, ముఖ్యమంత్రి సమక్షంలో జరిగిన రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం ఏఐ అండ్ డిఎస్ విభాగంలో చదువుతున్న పి.గాయత్రి, ద్వితీయ సంవత్సరం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో విద్యనభ్యసిస్తున్న ఎస్.హరికృష్ణలు పాల్గొని ప్రతిభ చూపారని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టి నావెల్ యూనిట్ ఆఫీసర్ డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కనీసం మూడు నెలల కఠిన శిక్షణ శిబిరాలలో వరుసగా ప్రతిభ కనబరిచిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేస్తారని, అందులో తమ విద్యార్థులు ఎన్నిక కావడం గర్వించదగ్గ విషయమని తెలిపారు. ఈ విద్యార్థులను కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు.

# గూడూరు డివిజన్

## పేదలకు విరివిగా రుణాలు ఇవ్వాలి : ఎమ్మెల్యే



వెంకటగిరి, ఫిబ్రవరి 19, ప్రభాతవార్త పేదలకు విరివిగా రుణాలు ఇవ్వాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బ్యాంకర్లను కోరారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఒసి తదితర వారికి సబ్సిడీ రుణాలను ప్రభుత్వ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకర్లు లబ్ధిదారులను ఇబ్బంది పెట్టకుండా విరివిగా రుణాలు ఇవ్వాలని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్లు చెప్పారు. సబ్సిడీ రుణాలను పేదల జీవితాల్లో వెలుగు నింపేందుకు ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు.

## నేడు మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జయంతి

వెంకటగిరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి 90వ జయంతి వేడుకలు వెంకటగిరిలో నిర్వహిస్తున్నట్లు పట్టణ పార్టీ అధ్యక్షుడు పులి ప్రసాద్‌రెడ్డి తెలిపారు. నేదురుమల్లి నివాస గృహంలో జనార్దన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని తెలిపారు. అనంతరం నేదురుమల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తామని చెప్పారు.

## మహాసభలను జయప్రదం చేయండి



గూడూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : ఏఐటీయూసీ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలు బైరాగి పట్టెడ లో సిపిఐ కార్యాలయంలో ఈనెల 23, 24 తేదీల్లో రెండు రోజుల పాటు తిరుపతిలో జరగనున్నాయి. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలు రెండు రోజులపాటు తిరుపతిలో జరిగే మహాసభలలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారాలు రాబోయే కాలంలో చేపట్టవలసిన ఆందోళన కార్యక్రమాలు రూపకల్పన జరుగుతుందని అలాగే నూతన సమితి ఏర్పాటు కూడా జరుగుతుంది అని వారు అన్నారు. రాష్ట్రంలో గతంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం మొన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టంలోని నిధులను ఇతర అవసరాలకు మళ్లించి వాడుకున్నారని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని నిర్వీర్యం చేశారన్నారు. అందువల్ల భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కారం కాలేదని 40 వేలకు పైగా రాష్ట్రంలో పెండింగ్ క్లైములు పరిష్కారానికి నోచుకోకుండా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ ప్రభాకర్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి శశి కుమార్, నగర కార్యదర్శి కాలేషా, ఏఐటీయూసీ నాయకులు వెంకటయ్య, విఆర్‌నాయుడు, మేస్త్రి చౌడయ్య, తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో చేప పిల్లలను విడదల



చిల్లకూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : చిల్లకూరు చెరువులో మత్స్య శాఖ ఆధ్వర్యంలో పిఎంఎంఎస్‌వై పథకం ద్వారా బుధవారం టిడిపి నాయకులు, పెంచలకోన ఆలయ మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ తానంకి నానాజీ చేతుల మీదుగా ఉచితంగా చేప పిల్లలను చెరువులో వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఎంఎంఎస్‌వై పథకం ద్వారా చెరువులో చేప పిల్లలను వదలడం జరిగిందని, ఈ పథకం ద్వారా ఎంతో మంది గిరిజనులకు జీవనోపాధి కల్పించబడుతుందని, చేపలను తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలియజేశారు. అనంతరం నూతనంగా ఎంపికైన చేపల చెరువు సొసైటీ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పట్టాభి రామిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు ఉచ్చూరు వెంకటేశ్వర్లు రెడ్డి,రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, రామచంద్ర రెడ్డి, దాసరి రాంప్రసాద్, మాజీ సర్పంచ్ రామ్మూర్తి, జిల్లా మత్స్య శాఖ అధికారి నాగరాజు, మత్స్య శాఖ అభివృద్ధి అధికారి రఘు బాబు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చు



చిల్లకూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : చిల్లకూరులోని వెంకటేశ్వర స్వామి గుడి ప్రాంగణలో ఉన్నటువంటి సాయి విద్యానికేతన్ పాఠశాల నాలుగవ వార్షికోత్సవం డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాల్ నందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్వీ బీవీడీ కళాశాల డైరెక్టర్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇంత చక్కటి వాతావరణంలో పాఠశాల వార్షికోత్సవం జరుపుకోవడం చాలా ఆనందదాయకం అన్నారు. విద్యతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలమని అటువంటి శక్తి విద్యకి మాత్రమే ఉన్నదని తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మా పాఠశాల తల్లిదండ్రుల సహకారంతో విద్యాసంస్థ అభివృద్ధి చెందుతున్నదన్నారు. ఇదే స్ఫూర్తితో చిల్లకూరు నందు సాయి విద్యానికేతన్ జూనియర్ కళాశాల పొదలకూరు నందు ఎస్వీ బీవీడీ కళాశాల అదేవిధంగా వచ్చే సంవత్సరం నుండి వర్ధన్‌రెడ్డి గ్రూప్ ఆఫ్ కళాశాలలో కూడా సాయి విద్యానికేతన్ కళాశాల ఆధ్వర్యంలో నడపబడుతాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రావణి, దయాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యుత్ పరికరాల గోల్‌మాల్‌పై విచారణ

కోట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : కోట మండలం చెందోడు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మెటీరియల్ గోల్‌మాల్ జరిగిందన్న ప్రచారంపై బుధవారం విద్యుత్ శాఖ గూడూరు డివిజన్ ఇఇ నరేంద్రరెడ్డి విచారణ చేపట్టారు. చెందోడు సబ్ స్టేషన్ పరిధిలోని క్రిందిస్థాయి ఉద్యోగులతో ఆయన సమీక్ష నిర్వహించారు. సబ్‌స్టేషన్‌లో మెటీరియల్ ఎక్కడెక్కడ ఉపయోగించారు, తుపాను నేపథ్యంలో వచ్చిన కోట్లాది రూపాయల పరికరాలు ఏమయ్యాయని విచారణలో ఉద్యోగులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఇఇ నరేంద్రరెడ్డిని 'ప్రభాతవార్త' ప్రశ్నించగా, వాస్తవాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు.

## సోమశేఖర్‌రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



నాయుడుపేట పిబ్రవరి 19 ప్రభాతవార్త : వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు మద్దాలి సోమశేఖర్‌రెడ్డిని సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వైసిపి నాయకులతో కలిసి బుధవారం పరామర్శించారు. పెళ్ళకూరు మండలం చావాలి వద్ద సోమశేఖర్‌రెడ్డి ప్రయాణిస్తున్న కారు ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తాపడిన విషయం తెలిసిందే. అలాగే ప్రమాదానికి గల కారణాలను అడిగితెలుసుకొన్నారు. ఆయన వెంట మాజీ ఎన్‌డిసిసిబీ చేర్మెన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి తదితర వైసిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## గూడూరు నుంచి తిరుమలకు బస్సు ప్రారంభించాలి



గూడూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ నందు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర విద్యా శాఖ లోకేష్‌ని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. గూడూరు నుండి తిరుమల బస్సులను తిరిగి ప్రారంభించాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వినతిపత్రం అందించారు.

## ఆదాయ పన్నుతోనే దేశాభివృద్ధి

**- తిరుపతి 1వ రేంజ్ ఆదాయపన్ను శాఖ అడిషనల్ కమిషనర్ వంశీధర్**



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : ఆదాయానికి అనుగుణంగా ప్రజలు ఇన్‌కంట్యాక్స్ చెల్లించడం ద్వారా దేశాభివృద్ధి సాధించవచ్చని తిరుపతి 1వ రేంజ్ ఆదాయపన్ను శాఖ అడిషనల్ కమిషనర్ వంశీధర్ అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ చిన్ని సత్య నారాయణ సహాయ సహకారాలతో ఆదాయ పన్ను అవగాహన సదస్సు వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులకు నిర్వహించారు. వంశీధర్ మాట్లాడుతూ ఆదాయ పన్ను కడితే దేశం అభివృద్ధి సాధిస్తుందన్నారు. తిరిగి అభివృద్ధి మనకే ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఆదాయపన్ను చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. మనిషి మానసికంగా, శారీరకంగా ఎలా ఆరోగ్యంగా ఉండాలనుకుంటారో దేశానికి ఆర్థికపరమైన అనారోగ్యం రాకుండా చూసు కోవాలంటే ఆదాయ పన్ను చెల్లించాలని కోరారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వ్యాపారులకు ఆదాయ పన్ను చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆదాయ పన్ను శాఖ అధికారి మోహన్‌కృష్ణ, స్థానిక వ్యాపార సంఘాలకు చెందిన వాకిచర్ల శాంతారావు, ఎ.భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఎస్టి కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం



వెంకటగిరి, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : ఈనెల 17వ తేదీన దక్కిలి మండలం మోపూరులో ఫారెస్ట్, పోలీస్ అధికారులు గిరిజనులపై వేధింపులకు పాల్పడడాన్ని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసి పెంచలయ్య తీవ్రంగా ఖండించారు. వెంకటగిరిలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోపూరు సర్వే నెంబర్ ఒకటికి సంబంధించి రెవెన్యూ రికార్డుల ప్రకారం అలాగే ఎమ్మార్వో ఇచ్చిన ఎండార్స్ మెంట్ ప్రకారం 1252 ఎకరాలు మేత పోరంబోకుగా ఉందని, ఆ యొక్క పొలంలో గతంలో నిమ్మ చెట్లు సాగు చేయగా, ఫారెస్ట్ అధికారులు గిరిజనులపై అక్రమంగా కేసులు పెట్టి, వెంకటగిరి కోర్టులో హాజరు పరిచారని తెలిపారు. రికార్డులను పరిశీలించిన జడ్జి రిమాండ్ రిపోర్టును తిరస్కరిస్తూ గిరిజనులను విడుదల చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత కూడా ఫారెస్ట్ అధికారులు గిరిజనులపై వేధింపులకు పాల్పడటంతో మా గిరిజనులందరం హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడం జరిగింది. ప్రస్తుతం అది హైకోర్టులో ఉందని, మేము చట్టాన్ని గౌరవిస్తూ ముందుకు వెళుతుంటే ఫారెస్ట్ అధికారులు గిరిజనులపై అసత్యాలు ప్రచారం చేస్తూ వేధింపులకు పాల్పడడం ఏమిటని ప్రశ్నించారు. తిరుపతి జిల్లా అధ్యక్షులు తలపల చెంచు మల్లికార్జున, మహిళా అధ్యక్షురాలు చెంబేటి ఉష, నాగరాజు, గిరిజనులు పాల్గొన్నారు.

## అంగన్వాడి వర్కర్స్ ఇంటర్వ్యూలు

గూడూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : గూడూరు రెవిన్యూ డివిజన్లోని వెంకటగిరి గూడూరు కోట ప్రాజెక్టు పరిధిలో బుధవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీన ఆధ్వర్యంలో వర్కర్స్ 52 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా 27 ఎలిజిబుల్ అయ్యారు. అయితే పోస్టులు మాత్రం 7 మాత్రమే ఉన్నాయి. అదేవిధంగా హెల్పర్‌లకు సంబంధించి 44 మంది ఇంటర్వ్యూకు హాజరు కాగా 37 మంది ఎలిజిబుల్ అయ్యారు. అయితే 15 హెల్పర్ పోస్టు మాత్రమే ఉన్నాయని రాఘవేంద్ర మేనన్ అన్నారు.

## కన్నుల పండుగలా పుష్పాలంకరణ



బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : క్రోధినామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర రుతువు, మాఘమాసం, కృష్ణపక్షం, సప్తమిన శక్తిక్షేత్రం బోయకొండపై లక్షకుంకుమార్చనను అట్ట హాసంగా ప్రారంభించారు. ప్రధాన ఆలయాల్లోని అమ్మవార్లకు నిర్వహించిన పుష్పాలంకరణ భక్తులను ముగ్దులను చేసింది. ఉదయాన్నే వేదపండతులు, అర్చకులు గోవర్ధనశర్మ, గంగిరెడ్డి, కృష్ణ మూర్తి, సుధాకర్‌ల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, పుష్పాలంకరణ గావించారు. ఆవరణంలో ఉత్సవ విగ్రహాన్ని వుంచి దంపతుల సమక్షంలో లక్షకుంకుమార్చనను ప్రారంభించారు. ఉభయదారుల ఆధ్వర్యంలో నిర్వహించిన హోమాది కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భక్తులకు ఉచిత అన్నప్రసాదమందించారు.

## శివయ్య సేవలో కేంద్ర మంత్రి పూజలు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరుని సేవలో బుధవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కుటుంబసభ్యులతో పాల్గొన్నారు. వారికి ఆలయం వద్ద శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి దంపతులుస స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న మంత్రి చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించారని అందుకు తాను కుటుంబసభ్యులతో వాయులింగేశ్వరుని దర్శించుకున్నానని వివరించారు. తాను పయనిస్తూ రోడ్లను చూసానని అలాగే సుధీర్‌రెడ్డి గెలిచిన తరువాత పట్టణానికి సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారన్నారు. స్వాగతం పలికిన వారిలో శాప్ చైర్మెన్ రవినాయుడు, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ చెంచయ్యనాయుడు,అమర్‌నాథ్, ఎం. సుబ్రమణ్యం రెడ్డి,డాక్టర్ కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లికొండేశ్వర ఆలయంలో వైభవంగా ధ్వజారోహణం



నాగలాపురం, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: నాగలాపురం మండలం సురుటుపల్లి గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పల్లికొండేశ్వర స్వామి ఆలయంలో పది రోజుల పాటు జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం రెండో రోజు కావడంతో వైభవంగా ధ్వజారోహణం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయం తరచూ శుద్ధి చేసి శ్రీ వాల్మీకేశ్వర స్వామికి శ్రీ మరకదాంబిక అమ్మవారికి శ్రీ దాంపత్య దక్షిణామూర్తికి ఆలయంలోని పరివార దేవతలకు విశేష అభిషేక అలంకరణ అనంతరం నైవేద్యం సమర్పించి భక్తులకు సర్వదర్శనం కల్పించారు. వృషభ లగ్నంలో వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ ఆలయ ప్రదర్శన అనంతరం ధ్వజారోహణం వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దర్శించుకోవడం జరిగింది. స్వామి, అమ్మవార్లను వివిధ రకాల పుష్పాలంకరణ చేసి పల్లకి వాహనంపై వేంపచేసి మాడవీధుల్లో ఊరేగించారు. ఈ పల్లకి వాహనం ఉత్సవానికి ఉభయ దారులుగా పిచ్చాటూరు మండలం గోవర్ధనగిరికి చెందిన మాజీ ఎమ్మెల్సీ జయచంద్రనాయుడు కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## పల్లెపల్లెకు... బెల్టు దుకాణాలు

సత్యవేడు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త: సత్యవేడులో ప్రభుత్వ మద్యం దుకాణాల పక్కనే యథేచ్ఛగా అక్రమ బార్లుకొనసాగుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గత ఏడాది అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని మద్య రహితంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో ముందడుగు వేసింది. ఇందులో భాగంగానే ప్రైవేటు వ్యక్తుల నిర్వహణలో ఉన్న మద్యం దుకాణా దారులు పల్లెపల్లెకు బెల్టు దుకాణాలు పుట్టగొడుగుల వచ్చేశాయి. దుకాణాల సమీపంలో మద్యం తాగడానికి, బార్లు నిర్వహణ నిషేధించింది. అయితే సత్యవేడులో మద్యం దుకాణాల పట్టణంలో ఐదు మద్యం షాపులు నడుస్తున్నాయి. ఈ మద్యం షాపుల పక్కనే కొందరు టిఫిన్ కేంద్రాలను నడుపుతున్నారు. వీటి వెనుక అక్రమంగా బార్లు నడుస్తున్నడంతో మద్యం ప్రియులు అక్కడే కూర్చొని మద్యాన్ని సేవిస్తున్నారు. దీంతో నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. అక్రమ బార్లు బార్లు కొనసాగుతున్నా సంబంధిత ఎక్సైజ్ అధికారులు చోద్యం చూడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## సైన్సెస్ ల్యాబ్‌లను పరిశీలించిన లోకేష్

తిరుపతి విద్య, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటీలో ఐటి, లైఫ్ సైన్సెస్ ల్యాబ్ లను రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి అధ్యాపకులు మంత్రి లోకేష్ కు వివరాలు తెలియజేస్తూ... తాము అతితక్కువ ఖర్చుతో డ్రోన్ పిసిబిలు తయారు చేస్తున్నామని చెప్పారు. 2.5 కి.మీ.ల రేంజిలో పనిచేసే అధునాతన డ్రోన్ ను తాము కేవలం రూ.5లక్షలతో తయారు చేశామని తెలిపారు.గతప్రభుత్వంలో చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్నపుడు జ్ఞానభేరి కార్యక్రమంలో ఈ ల్యాబ్ ఏర్పాటుచేశారని అన్నారు. డ్రోన్ సాఫ్ట్ వేర్ పై దృష్టిసారించాల్సిందిగా మంత్రి లోకేష్ సూచించారు.సోలార్ ఫోన్ చార్జర్,వాటర్ బాటిల్స్ వ్యర్థాలతో బ్యాగుల తయారీ, బనానా వేస్ట్ తో తయారు చేసిన శాలువా,హెర్బల్ శానిటరీ న్యాప్కిన్స్ తదితర ఆవిష్కరణలను మంత్రి లోకేష్ పరిశీలించారు. అనంతరం లైఫ్ సైన్సెస్ ల్యాబ్ టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ ను మంత్రి లోకేష్ పరిశీలించారు. 2017లో చంద్రబాబునాయుడు సిఎంగా ఉన్నపుడు ఈ ల్యాబ్ ను ప్రారంభించారని సిబ్బంది తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన టెక్నాలజీ అండ్ సాఫ్ట్ వేర్ విభాగం, జునెసిస్, పద్మావతి వర్సిటీ సంయుక్తంగా ఈ ల్యాబ్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఐఐటి, ఐషర్ వంటి ఉన్నత విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థుల నవీన ఆవిష్కరణలు, స్టార్టప్ లకు తాము సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నామని, 40లక్షల వరకు ఈక్విటీ సాయం కూడా చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటివరకు 26మందికి 3కోట్లు అందించామని, మరో 14మందికి త్వరలో ఆర్థిక సాయం చేయనున్నట్లు తెలిపారు. ఇన్నోవేషన్స్, స్టార్టప్స్ ను ప్రోత్సహించడమే తమ లక్ష్యమని వారు చెప్పారు.

## ఆధ్యాత్మిక పర్యాటకంలో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

**-ఐటిసిఎక్స్ ముగింపు సదస్సులో రాష్ట్రమంత్రి లోకేశ్**



తిరుపతి,ఫిబ్రవరి 19ప్రభాతవార్త: దేశంలో హిందూ దేవాలయాలు ఆధ్యాత్మికంగానేగాక ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా అందిపుచ్చు కోవడంలో ముందున్నాయనడానికి ఐటిసిఎక్స్ సదస్సు నిదర్శనమని రాష్ట్రమంత్రి నారా లోకేశ్ అన్నారు. ఆధ్యాత్మిక పర్యాటకం, టెంపుల్ టూరిజంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందన్నారు. సాంకేతికత వినియోగంలో ఉన్నా దేవుడే మనల్ని నడిపించే దన్నారు. ఇస్రో శాస్త్రవేత్తలు కూడా వారి ప్రయోగం విజయవంతం కావాలని చెంగాలమ్మ ఆలయంలోనో, తిరుమల శ్రీవారి ఆలయంలోనో ముందురోజు పూజలు చేస్తారని ఆయన గుర్తుచేశారు. అంతర్జాతీయ ఆలయాల కన్వెన్షన్, ఎక్స్‌పో(ఐటిసిఎక్స్)2025 ముగింపుసదస్సు బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిధిగా రాష్ట్రమంత్రి నారాలోకేశ్ హాజరై ఆధ్యాత్మికత, భక్తిభావం, ఆలయాల ప్రాశస్త్యం గురించి చక్కగా వివరించారు. మన పురాణాలు, మన దేవుళ్ళు, మన పండుగలు, ఆచారాలు గురించి పిల్లలకు పుస్తకాలు ఇవ్వాలన్నారు. మన శ్రీకృష్ణుడి లీలలు, మన రాముడి గోప్పతనం గురించి పిల్లలకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రమంత్రి అనగాని సత్యప్రసాద్, ఐటిసిఎక్స్ టెంపుల్‌కన్వెన్షన్ వ్యవస్థాపకుడు గిరీష్‌వాసుదేవ్‌కులకర్ణి, ఛైర్మన్‌ప్రసాద్‌లాడ్, జిల్లా ఎమ్మెల్యేలు తదితరులు పాల్గొన్నారు.

## గణనాధుని సన్నిధిలో అన్నవరం దేవస్థానం ఈఓ

కాణిపాకం,ఫిబ్రవరి 18 ప్రభాతవార్త: అన్నవరం శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానం ఈఓ సుబ్బారావు బుధవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

**- అధికారులను ఆదేశించిన మంత్రి నారాయణ**



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని అధికారులను మంత్రి నారాయణ ఆదేశించారు. బుధవారం సీఎం చంద్రబాబు ఆదేశాలతో తుడా అధికారులతో మంత్రి నారాయణ సమీక్ష చేశారు. విజయవాడలోని సీఆర్డీయే కార్యాలయంలో జరిగిన సమీక్షకు పురపాలక శాఖ కమిషనర్, డైరెక్టర్ సంపత్ కుమార్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ తుడా వైస్ చైర్మన్ మౌర్య, పట్టణ ప్రణాళిక విభాగం డైరెక్టర్ విద్యుల్లతతో పాటు తుడా అధికారులు హాజరయ్యారు. తుడాకు వస్తున్న రెవిన్యూ, ఖర్చుల వివరాలు మంత్రి అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ పెంపునకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. తుడా పరిధిలో భూములను అభివృద్ధి చేయడం ద్వారా ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. అవసరమైతే పీపీపీ విధానంలో భూములను అభివృద్ధి చేసి అమ్మకాలు చేయడం ద్వారా ఆదాయం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనిద్వారా అథారిటీ పై భారం తగ్గుతుందన్నారు. పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో లే అవుట్‌లలో హౌసింగ్ ప్రాజెక్టులను చేపట్టాలని మంత్రి సూచించారు. మరోవైపు తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ పరిధిలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని గ్రామపంచాయతీల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను తుడా నుంచి విడుదల చేయాలని మంత్రి ఆదేశించారు. తిరుపతిలో 3.61ఎకరాల్లో జీ+13 అంతస్తుల్లో నిర్మిస్తున్న తుడా టవర్స్ పనులపైనా మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తిరుపతి నగరానికి తలమానికంగా ఉండేలా టవర్స్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. టెంపుల్ సిటీ తిరుపతి లో పరిశుభ్రత,సుందరీకరణకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి నారాయణ అధికారులను సూచించారు. తుడా టవర్స్ బ్రోచర్‌ను మంత్రి నారాయణ ఆవిష్కరించారు.

## అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత



గూడూరు, ఫిబ్రవరి 19 ప్రభాతవార్త : గూడూరులో ఇష్టా రాజ్యంగా పగలు, రాత్రి తేడా లేకుండా రెచ్చిపోతున్న గ్రావెల్ దందాదారులపై రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేసి కళ్లెం వేశారు. బుధవారం గూడూరు పట్టణ శివారులోని జగనన్న లేఔట్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్, మట్టిని జెసిబితో తవ్వి తరలిస్తున్న వాహనాలను గూడూరు మండల తాసిల్దార్ ఆదేశాలతో విఆర్‌ఓ, సిబ్బంది గుర్తించి రెండు ట్రాక్టర్లను, జెసిబి ని స్వాధీనం చేసుకొని గూడూరు రూరల్ పోలీసులకు అప్పగించారు. గత ఆరు నెలల నుండి గూడూరు పట్టణం, పరిసర ప్రాంతాలకు పట్టణం శివారులోని టిడ్కో గృహాల వెనుక భాగాన గత ప్రభుత్వంలో అనుమతులు లేకుండా తీసిన ప్రాంతంలో పెద్ద పెద్ద జెసిబి,హిటాచీలతో మట్టిని గ్రావెల్ ను తీసి టిప్పర్లతో, ట్రాక్టర్లతో పగలు, రాత్రి తరలించినా అధికారుల్లో స్పందన లేకపోయింది. బుధవారం ఒక్కసారిగా అక్రమంగా తరలిస్తున్న వాహనాలపై రెవెన్యూ సిబ్బంది దాడులు చేసి స్వాధీనం చేసుకోవడం అందరిని ఆశ్చర్యాన్ని గురిచేస్తుంది. అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, జెసిబి యజమానులపై చర్యలు ఏ విధంగా ఉంటాయో వేచి చూడాలి.